ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

5



అనకాపల్లి

జిల్లా వార్తలు

శనివారం 29 నవంబరు 2025

నేడు పవన్‌కల్యాణ్ విశాఖ రాక



విశాఖపట్నం, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి కె.పవన్‌కల్యాణ్ శనివారం నగరానికి రానున్నారు. మధ్యాహ్నం 3.30 గంటలకు బేగంపేట ఎయిర్‌పోర్టు నుంచి బయలుదేరి 4.30 గంటలకు విశాఖపట్నం రానున్నారు. విమానాశ్రయం నుంచి నేరుగా తూర్పు నౌకాదళంలోని అతిథి గృహానికి వెళతారు. సాయంత్రం 5.50 గంటలకు ఐఎన్‌ఎస్ సముద్రికలో తూర్పు నౌకాదళం ఏర్పాటుచేసే కార్యక్రమానికి హాజరవుతారు. రాత్రి 8.30 గంటలకు హైదరాబాద్ బయలుదేరి వెళతారు.

రెవెన్యూలో పైసావసూల్



ప్రతి పనికీ రేటు

- కాసులు పడితేనే కదులుతున్న ఫైల్



అనకాపల్లి తహశీల్దారు కార్యాలయం

- మ్యుటేషన్‌కు రూ.పది వేలు
- 22ఏ నుంచి తొలగించాలంటే ఎకరాకు రూ.లక్ష
- ఇదీ జిల్లాలో తహశీల్దారు కార్యాలయాల తీరు
- ఏసీబీకి ఫిర్యాదులు

(అనకాపల్లి-ఆంధ్రజ్యోతి)

జిల్లాలో రెవెన్యూలో అవినీతి మర్రి ఊడల్లా విస్తరిస్తోంది.. పలు తహశీల్దారు కార్యాలయాల్లో అవినీతికి అడ్డూ, అదుపూ లేకుండా పోతోంది. గత వైసీపీ ప్రభుత్వంలో కొందరు నేతలు తహశీల్దారు కార్యాలయాలే అడ్డాగా చేసుకొని భూ లావాదేవీలు సాగించేవారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత పరిస్థితి మారుతుందని అంతా భావించారు. కానీ మార్పు కనిపించడం లేదనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

మండలాల్లో తహశీల్దారు కార్యాలయానికి భూ సమస్యల పరిష్కారం కోసం వెళ్లేవారిని కొందరు ఉద్యోగులు డబ్బుల కోసం జలగల్లా పట్టి పీడిస్తున్నారు. ప్రతి పనికి పైసలు చేతిలో పడితేనే ఫైలు ముందుకు కదులుతోంది. లేదంటే రకరకాల కొర్రీలు పెట్టి నెలల తరబడి మూలకు చేరుతున్నాయన్నది బహిరంగ రహస్యంగా మారిపోయింది. తాజాగా అనకాపల్లి కలెక్టరేట్‌కు కూతవేటు దూరంలో ఉన్న మారేడుపూడి, అక్కిరెడ్డిపాలెం పంచాయతీల వీఆర్‌ఓ సూర్యనారాయణ రైతు నుంచి లంచం తీసుకుంటూ రెడ్‌హ్యాండెడ్‌గా ఏసీబీ అధికారులకు పట్టుబడడం రెవెన్యూలో కలకలం రేపుతోంది. మారేడుపూడి వీఆర్‌ఓ సూర్యనారాయణ అక్కిరెడ్డిపాలెంకు అదనపు బాధ్యతలు చేపడుతున్నారు. తండ్రి నుంచి కుమారుడికి దఖలు పడాల్సిన మూడు ఎకరాల భూమికి పాస్ పుస్తకాలు ఇచ్చేందుకు రూ.20 వేలు లంచం తీసుకొంటూ అనకాపల్లి తహశీల్దారు కార్యాలయంలో ఏసీబీకి వీఆర్‌ఓ పట్టుబడ్డాడు. కలెక్టరేట్‌కు సమీపంలో ఉన్న మారేడుపూడి, అక్కిరెడ్డిపాలెం వీఆర్‌ఓ అనకాపల్లి తహశీల్దారు కార్యాలయానికి ఎందుకు వచ్చారనేది చర్చనీయాంశంగా మారిపోయింది. జిల్లాలో 24 తహశీల్దారు కార్యాలయాలు ఉండగా 522 గ్రామ సచివాలయాలు ఉన్నాయి. అన్ని మండలాలకు తహశీల్దార్లు



ఏసీబీకి పట్టుబడిన మారేడుపూడి వీఆర్‌ఓ పనిచేస్తున్న సచివాలయం

ఉండగా 380 మంది వీఆర్‌ఓలు పనిచేస్తున్నారు. ప్రతి మండలానికి ఇద్దరు చొప్పున మండల సర్వేయర్లు, డీటీలు, ఆర్‌ఐలు ఉన్నారు. వీఆర్‌ఓ పోస్టులు ఖాళీగా ఉండడంతో కొన్ని మండలాల్లో ఒక వీఆర్‌ఓ రెండు మూడు పంచాయతీల బాధ్యతలు నిర్వహిస్తున్నారు. మండల రెవెన్యూ కార్యాలయంలో ఏ చిన్న పని జరగాలన్నా వీఆర్‌ఓలు, మండల సర్వేయర్లే కీలకం. తహశీల్దారుకు అందిన ప్రతి అర్జీని వీఆర్‌ఓలు, సర్వేయర్లకు క్షేత్రస్థాయి పరిశీలనకు పంపుతారు. వీరి రిపోర్టు ఆధారంగానే తహశీల్దార్లు నిర్ణయాలు తీసుకుంటారు. ఇదే అదనుగా భావించి వీఆర్‌ఓలు, సర్వేయర్లు ఒక్కటై వివిధ పనులపై కార్యాలయానికి వచ్చే రైతులు, భూయజమానుల నుంచి అందినంత దండుకుంటున్నారు. వీరు వసూలు చేసే మొత్తంలో ఎవరి వాటాలు వారికి వెళతాయన్నది బహిరంగ రహస్యం. దీంతో క్షేత్రస్థాయిలో వీఆర్‌ఓలు, సర్వేయర్లు రిఫర్ చేసిన ఫైళ్లు వేగంగా కదులుతాయి. తహశీల్దారు కార్యాలయాలకు రైతులు, భూ యజమానులు వస్తుంటారు. వారసత్వ ఆస్తి తమ పేరున (మ్యుటేషన్), రెవెన్యూ రికార్డులు, పాస్ పుస్తకాల్లో తప్పుల సవరణ, రకరకాల ధ్రువపత్రాల జారీ కోసం ఎక్కువగా దరఖాస్తులు అందుతుంటాయి. వారసత్వంగా దఖలు పడిన భూమికి సంబంధించి మొత్తం భూమిని సబ్ డివిజన్ చేసి పట్టాదారు పాస్‌పుస్తకాలు జారీ చేయాల్సి ఉంటుంది. పంట పొలాలు ఒకరి నుంచి మరొకరికి బదలాయించే క్రమంలో సరిహద్దులు నిర్ణయించేందుకు రెవెన్యూ, సర్వే అధికారులకు అర్జీలు పెట్టుకుంటారు. ఎక్కువగా సంఖ్యలో వారసత్వ ఆస్తి మ్యుటేషన్ కోసం అర్జీలు అందుతుంటాయి. మ్యుటేషన్ చేయాలంటే తహశీల్దారు కార్యాలయ సిబ్బందికి ఎకరా భూమికి రూ.10 వేలు తక్కువ కాకుండా ముట్టజెప్పాల్సిందే. లేదంటే ఫైలు అడుగు కదలదు. అంతేకాకుండా సరైన రికార్డులు లేకపోయినా తమ ఆధీనంలో ఎన్నో ఏళ్లుగా ఉన్న భూములను 22ఏ (ప్రభుత్వ రికార్డుల్లో) నమోదైన సందర్భంలో తొలగింపు కోరుతూ భూ యజమానులు మండల రెవెన్యూ అధికారులకు దరఖాస్తులు చేసుకుంటారు. ఎకరా భూమిని 22ఏ ప్రభుత్వ రికార్డు నుంచి తొలగించాలంటే లక్షకు ... మిగతా 8వ పేజీలో

బీఎన్ రోడ్డుకు మోక్షం

పనులపై ముఖ్యమంత్రి సమీక్ష



రోడ్డు పక్కల చదును చేస్తున్న దృశ్యం

- ఎన్‌డీబీ పెండింగ్ బిల్లులు విడుదల చేసిన కూటమి ప్రభుత్వం
- రెండు కల్వర్టుల పనులు ప్రారంభం
- 'ఆంధ్రజ్యోతి' కథనంతో స్పందించిన రాష్ట్ర ప్రభుత్వం

చోడవరం, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): ఆరున్నరేళ్లుగా ఆగిపోయిన బీఎన్ రోడ్డు పనులలో ఎట్టకేలకు కదలిక వచ్చింది. రాష్ట్రంలో మార్చి నాటికి రోడ్లపై గుంతలు ఉండకూడదని, పనుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరించిన కాంట్రాక్టర్లపై కఠినంగా వ్యవహరించాలని సీఎం చేసిన హెచ్చరికలు తీవ్రంగానే ప్రభావం చూపించాయి. ఫలితంగా బీఎన్ రోడ్డు పనులలో కదలిక వచ్చింది. బీఎన్ రోడ్డు పనులు అర్ధంతరంగా ఆగిపోవడంతో ప్రజలు పడుతున్న కష్టాలపై ఈనెల 22వ తేదీన 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన కథనాల నేపథ్యంలో సీఎం చంద్రబాబు రహదారులపై ప్రత్యేకంగా సమీక్ష నిర్వహించారు. రోడ్డు పనులు ఎట్టి పరిస్థితుల్లో పూర్తి చేయాలని స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. ఈ ఆదేశాల ప్రభావం బీఎన్ రోడ్డు పనుల్లో కనిపిస్తున్నది. ప్రధానంగా చోడవరం నుంచి వెంకన్నపాలెం మార్గంలో శిథిలావస్థల్లో ఉండి, ప్రమాదాలకు కారణమవుతున్న రెండు కల్వర్టులను నిర్మించే పనులు ప్రారంభించారు. ఈ రెండు కల్వర్టులు కూల్చివేసి కొత్తగా కల్వర్టులు నిర్మించే పనులను చేపట్టారు. అంతవరకూ తాత్కాలికంగా వాహనాల రాకపోకలకు ఇబ్బంది లేకుండా, డైవర్షన్ రోడ్డు పనులు ప్రారంభించారు.



చోడవరం సమీపంలోని చోడవరం-గోవాడ మధ్య ఇరుకు కల్వర్టు వద్ద చేస్తున్న డైవర్షన్ రోడ్డు పనులు



రహదారులపై విపత్తుల పగ!

ఈనెల 22న రోడ్ల పరిస్థితిపై ఆంధ్రజ్యోతిలో వచ్చిన కథనం

ఎన్‌డీబీ పనుల పెండింగ్ బిల్లులు విడుదల

ఇదే సమయంలో రాష్ట్ర ప్రభుత్వం ఎన్‌డీబీ నిధులతో చేపట్టిన పనులకు సంబంధించి పెండింగ్ బిల్లుల చెల్లింపులకు రూ.276 కోట్లు విడుదల చేసింది. దీంతో ఎన్‌డీబీ పనులు ఊపందుకునే పరిస్థితి కనిపిస్తున్నది. ఉమ్మడి జిల్లాలో 11 రోడ్లు ఎన్‌డీబీ నిధులతో చేపట్టి మధ్యలో వదిలేసిన సంగతి తెలిసిందే. పెండింగ్ పనులకు సంబంధించి నిధులు విడుదల కావడంతో రోడ్డు పనులు చురుగ్గా సాగే పరిస్థితి ఉందని అంటున్నారు.

అన్ని వర్గాల సమష్టి పోరు

కాగా, బీఎన్ రోడ్డు దుస్థితిపై ఎమ్మెల్యేలు కేఎస్‌ఎన్‌ఎస్ రాజు, బండారు సత్యనారాయణ, జనసేన నేత పీవీఎస్‌ఎన్ రాజు తదితరులు ప్రభుత్వానికి చేసిన వినతులు, రోడ్డు పనులపై ... మిగతా 8వ పేజీలో

చురుగ్గా రైతు బజార్ పనులు



రైతు బజార్‌లో సిద్ధమవుతున్న బ్లాకులు

నెరవేరనున్న అనకాపల్లి వాసుల కల..



రైతులకు కేటాయించే బ్లాకులకు నంబర్లు వేసిన దృశ్యం

- ఎన్టీఆర్ మార్కెట్ యార్డులో ఏర్పాటు
- రూ.14 లక్షలు మంజూరు చేసిన ప్రభుత్వం
- నెల రోజుల్లో అందుబాటులోకి వచ్చే అవకాశం

అనకాపల్లి టౌన్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): **అనకాపల్లి ప్రజల చిరకాల వాంఛ ఎట్టకేలకు నెరవేరబోతోంది. పదేళ్లుగా ఊరిస్తున్న రైతు బజార్ ఎన్టీఆర్ మార్కెట్ యార్డులో ఏర్పాటు కానుంది. ఇప్పటికే యార్డులోని నాగదుర్గమ్మ ఆలయానికి వెళ్లే మార్గంలోని 17, 18 నంబర్లు గల బ్లాకులను సుందరంగా తీర్చిదిద్దడంలో మార్కెటింగ్ శాఖ నిమగ్నమైంది.**

అనకాపల్లి ప్రజలకు సరసమైన ధరలకు కూరగాయలు అందుబాటులోకి తీసుకువచ్చేందుకు 2018లో రైతు బజార్ ఏర్పాటుకు టీడీపీ ప్రభుత్వం చర్యలు చేపట్టింది. అప్పటి ఎమ్మెల్యే పీలా గోవింద సత్యనారాయణ రైతు బజార్ ఏర్పాటు కోసం ప్రత్యేక దృష్టి సారించారు. విజయవాడ నుంచి మార్కెటింగ్ శాఖ అధికారులు అనకాపల్లికి వచ్చి రైతు బజార్ ఏర్పాటుకు స్థలాన్ని పరిశీలించారు. డీసీఎంఎస్ స్థలాన్ని అప్పట్లో పీలా సారథ్యంలో అధికారులు పరిశీలించారు. అయితే ఆ స్థలాన్ని ఇవ్వడానికి డీసీఎంఎస్ అంగీకరించకపోవడంతో కొబ్బరికాయల మార్కెట్, మరో రెండు ప్రాంతాలను కూడా పరిశీలించారు. అయితే 2019 ఎన్నికల్లో టీడీపీ ప్రభుత్వం ఓటమి చెంది వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. అప్పటి ప్రజాప్రతినిధులు రైతు బజార్ పట్ల పెద్దగా ఆసక్తి చూపిన దాఖలాలు లేవు. అయితే 2022 మార్చిలోనే అనకాపల్లిలో రైతు బజార్ ఏర్పాటుకు సంబంధించిన జీవోను వైసీపీ ప్రభుత్వం విడుదల చేసినట్టు తెలిసింది. అయినప్పటికీ కూడా వైసీపీ పాలకులు రైతు బజార్ ఏర్పాటుపై దృష్టి సారించలేదన్న విమర్శలు లేకపోలేదు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ... మిగతా 8వ పేజీలో

జ్యోతిరావు పూలే ఆదర్శనీయులు

- కలెక్టర్ విజయకృష్ణన్



జ్యోతిరావు పూలే చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పిస్తున్న కలెక్టర్ విజయకృష్ణన్, అధికారులు, ఉద్యోగులు

అనకాపల్లి కలెక్టరేట్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): జ్యోతిరావు పూలే అందరికీ ఆదర్శనీయులని జిల్లా కలెక్టర్ విజయకృష్ణన్ పేర్కొన్నారు. కలెక్టర్ కార్యాలయ సమావేశమందిరంలో శుక్రవారం జ్యోతిరావు పూలే వర్ధంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జ్యోతిరావు పూలే చిత్రపటానికి కలెక్టర్ విజయకృష్ణన్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ అణగారిన వర్గాల అభ్యున్నతికి జ్యోతిరావు పూలే చేసిన కృషి మరువలేనిదన్నారు. మహిళల విద్య కోసం ఆయన విశేషంగా కృషి చేశారన్నారు. ఈ కార్యక్రమంలో డీఆర్‌వో వై.సత్యనారాయణరావు తదితరులు పాల్గొన్నారు.

అట్టహాసంగా రాష్ట్ర స్థాయి ఖోఖో పోటీలు

.... వివరాలు 8వ పేజీలో

పంచాయతీల పునర్విభజన

జనాభా, ఆదాయాల మేరకు కొత్త పంచాయతీల ఏర్పాటు

- 5 నుంచి 4 గ్రేడులకు కుదింపు
- రూ.కోటి ఆదాయం ఉంటే ఇకపై రూర్బన్ పంచాయతీ
- గ్రేడ్-1 కార్యదర్శులకు డిప్యూటీ ఎంపీడీవో క్యాడర్



కశింకోట మండలం తాళ్లపాలెం గ్రామ పంచాయతీ కార్యాలయం

(అనకాపల్లి-ఆంధ్రజ్యోతి)

గ్రామీణ ప్రాంతాల సమగ్ర అభివృద్ధే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం అడుగులు వేస్తోంది. ఇందులో భాగంగా పంచాయతీ రాజ్ వ్యవస్థను ప్రక్షాళన చేసేందుకు సన్నద్ధమవుతోంది. ప్రస్తుతం గ్రామ పంచాయతీల్లో అమలు జరుగుతున్న క్లస్టర్ వ్యవస్థను రద్దు చేసి, పంచాయతీలను స్వతంత్ర పరిపాలన యూనిట్లుగా మార్చనుంది. అలాగే పంచాయతీల ఏర్పాటుపై ఉన్న బ్యాన్‌ను ఎత్తివేసింది. గిరిజన ప్రాంత పంచాయతీల అభివృద్ధికి ప్రత్యేక ప్రణాళిక అమలు చేయనుంది. ఈమేరకు మంత్రిమండలి గతంలో ప్రతిపాదన చేయగా ఈనెల 4న ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ఇదే విషయాన్ని వెల్లడించారు. జిల్లా పంచాయతీ అధికారులకు మార్గదర్శకాలు జారీ చేయడంతో అధికారులు గ్రేడుల విభజన పనుల్లో నిమగ్నమయ్యారు. ప్రస్తుతం ఐదు గ్రేడులుగా ఉన్న గ్రామ పంచాయతీలను నాలుగు గ్రేడులకు కుదించనున్నారు. ఈ విధంగా కొత్త పంచాయతీలు ఏర్పాటు కానున్నాయి. పంచాయతీ కార్యదర్శుల పేర్లను పంచాయతీ డెవలప్‌మెంట్ ఆఫీసర్‌గా (పీడీఓ)గా పేరును మార్చనున్నారు. జిల్లాలో మొత్తం 24 మండలాలు ఉండగా 646 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. ఇందులో గ్రేడ్-1 పంచాయతీలు 36, గ్రేడ్-2లో 18, గ్రేడ్-3లో 131, గ్రేడ్-4లో 87, గ్రేడ్-5 కింద 323 గ్రామ పంచాయతీలున్నాయి. కొత్త పంచాయతీ వ్యవస్థ ప్రకారం జిల్లాలో ఇకముందు ఐదు గ్రేడుల్లో ఉన్న పంచాయతీలను నాలుగు గ్రేడులుగానే పరిగణిస్తారు. వీటిని స్వతంత్ర ... మిగతా 8వ పేజీలో



ఎలమంచిలిలో కనకమహాలక్ష్మి అమ్మవారి సారెను ఊరేగిస్తున్న భక్తులు

కనకమ్మ సారె ఊరేగింపు

ఎలమంచిలి, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): ఎలమంచిలి పట్టణంలోని ధర్మవరంలో కొలువైన కనకమహాలక్ష్మి అమ్మవారు సారె ఊరేగింపు శుక్రవారం కన్నుల పండువగా నిర్వహించారు. పెద్ద సంఖ్యలో మహిళా భక్తులు తరలివచ్చి అమ్మవారి నామస్మరణలతో సారె ఊరేగింపు కార్యక్రమంలో పాల్గొన్నారు. మహిళలు తమ ఇళ్ల వద్ద పిండివంటలు ... మిగతా 8వ పేజీలో

విద్యాసంస్థల బస్సుల తనిఖీ

లోపాలున్న నాలుగు బస్సులు సీజ్

- మరో 95 బస్సులకు నోటీసులు
- జిల్లా వ్యాప్తంగా మూడు బృందాలు తనిఖీలు
- జిల్లా రవాణాశాఖ అధికారి జి. మనోహర్

అనకాపల్లి టౌన్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని పలు ప్రైవేటు విద్యాసంస్థల బస్సుల ఫిట్‌నెస్‌పై రవాణా శాఖ అధికారులు శుక్రవారం ప్రత్యేక తనిఖీలు నిర్వహించారు. పాఠశాల విద్యార్థుల భద్రతను దృష్టిలో పెట్టుకుని రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహిస్తున్న తనిఖీల్లో భాగంగా జిల్లాలోని విద్యా సంస్థలకు ... మిగతా 8వ పేజీలో



ఫస్టు ఎయిడ్ బాక్స్ తనిఖీ చేస్తున్న దృశ్యం

గూగుల్‌కు 480 ఎకరాలు

యాదవ్ భవన్‌కు 2 ఎకరాలు

- మంత్రివర్గ సమావేశంలో నిర్ణయం

విశాఖపట్నం, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): గూగుల్ డేటా సెంటర్‌కు అవసరమైన భూములు కేటాయించేందుకు రాష్ట్ర మంత్రివర్గం శుక్రవారం ఆమోదం తెలిపింది. ఉమ్మడి విశాఖ జిల్లాలో అడవివరం, తర్లువాడ, రాంబిల్లిలో 480 ఎకరాలు ఇవ్వనున్నారు. ఈ భూములను గూగుల్ అనుబంధ సంస్థ రైడెన్ ఇన్ఫోటెక్‌కు ఇస్తారు. అలాగే ముడసర్లోవలో యాదవ్ భవన్ నిర్మాణానికి రెండు ఎకరాలు కేటాయించడానికి కూడా మంత్రివర్గం ఆమోదించింది. ఎకరా రూ.12.1 కోట్లు చొప్పున రెండు ఎకరాలకు రూ.24.2 కోట్లు చెల్లించాలని సూచించింది.

గంజాయి రవాణాపై పక్కా నిఘా

- మాదక ద్రవ్యాలను అరికట్టేందుకు ఎన్‌డీపీఎస్ సెల్ ఏర్పాటు
- 112, 1972 నంబర్లకు సమాచారం అందించండి : ఎస్పీ తుహిన్‌సిన్హా



పోలీస్ స్టేషన్‌లో రికార్డులు పరిశీలిస్తున్న ఎస్పీ తుహిన్‌సిన్హా

- 8లో

రాళ్లు తేలిన రహదారిపై అవస్థలు

- కొండవారపాలెం- గజిరెడ్డిపాలెం మధ్య రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు
- అధికారులు పట్టించుకోక పోవడంపై పలువురు ఆగ్రహం



గజిరెడ్డిపాలెం వెళ్లే రహదారి దుస్థితి

రాంబిల్లి, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కొండవారపాలెం నుంచి గజిరెడ్డిపాలెం వెళ్లే రహదారి శిథిలావస్థకు చేరుకుంది. ఈ రోడ్డు అడుగడుగునా దెబ్బతిని, రాళ్లుతేలి కనిపిస్తున్నాయి. దీనిపై నిత్యం మూడు గ్రామాల ప్రజలు రాకపోకలు సాగిస్తున్నారు. రాళ్లు తేలడంతో వారంతా నిత్యం నరకం చూస్తున్నారు. రాత్రి సమయాల్లో ఈ రోడ్డులో ప్రయాణించాలంటే సాహసం చేయాల్సి వస్తుందని అంటున్నారు. ఈ సమస్యను పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకు వెళ్లినా ఫలితం లేకపోతోందని వాపోతున్నారు. ఇప్పటికైనా కూటమి నేతలు స్పందించి రోడుప్డకు మరమ్మతులు చేపట్టాలని గజిరెడ్డిపాలెం, లోవపాలెం, వెంకయ్యపాలెం గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

సీఎం రిలీఫ్ ఫండ్ మంజూరు పత్రాలు అందజేత



మంజూరు పత్రాలు పంపిణీ చేసిన నాయకులు

అచ్యుతాపుర ం, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి) : పేదలను ఆదుకోవడమే కూటమి ప్రభుత్వం లక్ష్యమని వెదురువాడ సర్పంచ్ కొయ్య శ్రీనివాసరావు అన్నారు. ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి వెదురువాడకు చెందిన ఇద్దరు మహిళలకు సుమారు రూ. 64 వేలు మంజూరు కావడంతో శుక్రవారం ఆ పత్రాలను అందజేసి మాట్లాడారు. అందరి సహకారంతో గ్రామాన్ని అభివృద్ధి చేస్తున్నట్టు చెప్పారు.ఈకార్యక్రమంలో కొయ్య మహాలక్ష్మి, రాజేష్ వర్మ, సీరా శ్రీను, కిల్లాడి బాబూజీ, వి.శ్రీను తదితరులు పాల్గొన్నారు.

మాధవధారలో ట్రెక్కింగ్ రేపు

విశాఖపట్నం, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): పురాతన మాధవస్వామి ఆలయం నుంచి సింహాచల దేవస్థానం తోటల మీదుగా ఈ నెల 30న ట్రెక్కింగ్ నిర్వహించనున్నట్లు జీవీఎంసీ మాజీ డిప్యూటీ మేయర్ జె.శ్రీధర్ తెలిపారు. శుక్రవారం పోస్టరును ఆవిష్కరించారు. ఆర్.కె. ఫిట్‌నెస్ జిమ్, ఎడిక్ట్ ఫిట్‌నెస్ జిమ్‌ల సంయుక్త నిర్వహణలో ఈ కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు.

అభివృద్ధి, సంక్షేమానికి సమ ప్రాధాన్యం

- మాజీ ఎమ్మెల్సీ పప్పల చలపతిరావు
- ప్రజా దర్బార్‌లో వినతుల స్వీకరణ
- టీడీపీలో చేరిన వారికి కండువాలు కప్పి ఆహ్వానం

ఎలమంచిలి, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి) : అభివృద్ధి, సంక్షేమానికి సమప్రాధాన్యం ఇస్తూ రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ప్రజారంజక పాలన అందిస్తుందని మాజీ ఎమ్మెల్సీ పప్పల చలపతిరావు అన్నారు. ఇక్కడి టీడీపీ కార్యాలయంలో శుక్రవారం ప్రజా దర్బార్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురి నుంచి వినతులు స్వీకరించారు. అంతకుముందు ఆయన మాట్లాడుతూ గత ఐదేళ్ల పాలనలో అన్నివిధాలా నష్టపోయిన రాష్ట్రాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు తన పరిపాలనా అనుభవంతో గాడిన పెడుతున్నారన్నారు. అలాగే అప్పుల ఊబిలో కూరుపోయిన రాష్ట్రం ఆర్థిక ప్రగతి సాధించేలా ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌తో కలిసి కృషి చేస్తున్నట్టు చెప్పారు. ఇందుకు ప్రజలంతా తమవంతు సహకారాన్ని అందించి మరింత ఆశీర్వదించాల్సిందిగా కోరారు. అనంతరం ఆయన ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. పలువురితో స్వయంగా మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. నాలుగు మండలాలకు చెందిన బాధితుల కుటుంబాలకు రూ.29 లక్షల ముఖ్యమంత్రి సహాయన నిధి మంజూరు పత్రాలను అందజేశారు. వీటి ద్వారా మెరుగైన వైద్య సేవలు పొందాలని సూచించారు. ఈ కార్యక్రమంలో నియోజక వర్గ పరిశీలకుడు బొండా జగన్నాథం, రాష్ట్ర యాదవ కార్పొరేషన్ డైరెక్టర్ ధూళి రంగనాయకులు, రాజాన రమేష్, పట్టణ అధ్యక్షుడు గొర్లె నానాజీ, ఇత్తం శెట్టి నాయుడు, నాయకులు కరణం రవి కుమార్, రాజాన సూర్యనాగేశ్వరరావు, శ్రీనులతో పాటు కార్యకర్తలు పాల్గొన్నారు.



టీడీపీలో చేరిన నునపర్తి గ్రామానికి చెందిన వైసీపీ నాయకులతో మాజీ ఎమ్మెల్సీ చలపతిరావు

టీడీపీలో చేరిన నునపర్తి వైసీపీ నాయకులు

అచ్యుతాపురం: ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తన పరిపాలనా అనుభవంతో రాష్ట్రాన్ని ప్రగతి పథాన నడిపేందుకు కృషి చేస్తున్నారని మాజీ ఎమ్మెల్సీ పప్పల చలపతిరావు అన్నారు. మండలంలోని నునపర్తి వైసీపీ నాయకులు శుక్రవారం టీడీపీలో చేరిన సందర్భంగా జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రానికి లక్షల కోట్ల రూపాయలు పెట్టుబడులు పెట్టేందుకు ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలు ముందుకు వస్తున్నారని, ఇది చంద్రబాబు పాలనా సామర్థ్యానికి నిదర్శనంగా పేర్కొన్నారు. అనంతరం నునపర్తిలో వైసీపీ నాయకులు యాసవరపు పైడం నాయుడు, చిట్టిబాబు, సిరపురపు శ్రీనాథ్, మాసవరపు శ్రీను కుటుంబాలకు చెందిన సుమారు 40 మంది కార్యకర్తలు నునపర్తి సీనియర్ టీడీపీ నాయకుడు రెడ్డి నగేష్ ఆధ్వర్యంలో టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. వీరందరికీ చలపతిరావు కండువాలు కప్పి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ పరిశీలకుడు బొండా జగన్నాథం, రాష్ట్ర కార్యదర్శులు రాజాన రమేష్ కుమార్, ధూళి రంగనాయకులు, కాపు కార్పొరేషన్ డైరెక్టర్ శివ అప్పారావు, తెలుగుదేశం పార్టీ అచ్యుతాపురం, రాంబిల్లి మండలాల అధ్యక్షులు పీలా తులసీరామ్, లాలం భరత్, ఎంపీటీసీ వెంకటరావు, రెడ్డి శ్రీను, నరసింహనాయుడు తదితరులతో పాటుట పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

స్కౌట్స్ అండ్ గైడ్స్‌కు దుస్తులు అందజేత



ప్రభుత్వ సమకూర్చిన దుస్తులతో విద్యార్థులు

ఎలమంచిలి, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి) : ఇక్కడి కొత్తపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు ప్రధానోపాధ్యాయుడు వైవీ రమణ అధ్యక్షతన శుక్రవారం భారత్ స్కౌట్స్, గైడ్స్ దుస్తులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం అందిస్తున్న నిధుల నుంచి 32 మంది బాలికలకు ఈ దుస్తులను సమకూర్చినట్టు చెప్పారు. ఈ కార్యక్రమంలో స్కౌట్ మాస్టర్ కుందూరు రాజు, గైడ్ కెప్టెన్ కౌసల్య, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ప్రముఖ వ్యాపారవేత్త నారాయణరావు మృతి



నారాయణరావు (ఫైల్)

ఎలమంచిలి, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని ప్రముఖ వ్యాపారవేత్త వెంకటేశ్వర లాడ్జి యజమాని సూరకాసుల నారాయణరావు (82) గురువారం రాత్రి మృతి చెందారు. గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతూ ధర్మవరంలోని ఆయన స్వగృహంలో తుదిశ్వాస విడిచారు. పలు వ్యాపారాల్లో అభివృద్ధి సాధించిన నారాయణరావు మంచి పేరుప్రఖ్యాతులు సంపాదించారు. మాజీ ఎంపీపీలు గోవింద్, ఎర్రయ్యదొరలతో పాటు పలువురు ప్రముఖులు నివాళులర్పించారు.

జ్యోతిరావు పూలేకు నివాళి

ఎలమంచిలి/అచ్యుతాపురం, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి) : ఇక్కడి వైసీపీ క్యాంపు కార్యాలయంలో శుక్రవారం మహాత్మ జ్యోతిరావు పూలే వర్థంతిని ఆ పార్టీ నేతలు నిర్వహించారు. పార్లమెంటరీ నియోజకవర్గ నేత బొడ్డేడ ప్రసాద్, నియోజకవర్గ కన్వీనర్ కరణం ధర్మశ్రీ, రాష్ట్ర ప్రతినిధి బి.గోవింద్ తదితరులు ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నక్కపల్లి కేంద్రంగా రెవెన్యూ డివిజన్ ప్రకటించడంపై అభ్యంతరం వ్యక్తం చేశారు. నక్కపల్లిని కాకుండా ఎలమంచిలిని కేంద్రంగా రెవెన్యూ డివిజన్ ఏర్పాటు చేయాలని డిమాండ్‌చేశారు. ఎలమం చిలి కేంద్రంగా చేర్చడం కుదరకపోతే ఎలమంచిలి నియోజకవర్గాన్ని అనకాపల్లి ఆర్డీవో పరిధిలోనే ఉంచాలన్నారు. లేనిపక్షంలో ఉద్యమం చేపడతామని హెచ్చరించారు. మున్సిపల్ వైస్ చైర్మన్‌లు బెజవాడ నాగేశ్వరరావు, గుప్త, కొల్లిత్రినాథ్, దూది నరశింహమూర్తి, తదితరులు పాల్గొన్నారు.అలాగే, మండల కేంద్రం అచ్యుతాపురంలో వైసీపీ, సీపీఐ నాయకులు పూలే విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో వైసీపీ నాయకులు కరణం ధర్మశ్రీ, బొడ్డేడ ప్రసాద్, మాజీ ఎంపీపీ చేకూరి శ్రీనివాస రాజు, కోన బుజ్జి, కూండ్రపు వెంకునాయుడు, బలిరెడ్డి శ్రీను, నర్మాల కుమార్, సీపీఐ నాయకులు రొంగలి రాము, కూండ్రపు సోమునాయుడు పాల్గొన్నారు.

చట్టాలపై యువతకు అవగాహన అవసరం



జాలారిపాలెంలో మాట్లాడుతున్న సీఐ చంద్రశేఖర్



నాగులాపల్లి పాఠశాలలో మాట్లాడుతున్న ఎస్ఐ ప్రసాదరావు

అచ్యుతాపురం, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): చట్టాలపై యువతకు అవగాహన అవసరమని సీఐ ఆర్‌వీఎస్ఎస్ చంద్రశేఖర్ అన్నారు. మండలంలోని పూడిమడక శివారు జాలారిపాలెంలో శుక్రవారం సాయంత్రం చట్టాలపై ఏర్పాటైన అవగాహన సదస్సులో మాట్లాడారు. అతివేగంగా వాహనాలు నడపడంతో పాటు హెల్మెట్ ధరించకపోవడం కూడా నేరమన్నారు. అలాగే మహిళలు పట్ల అసభ్యంగా ప్రవర్తించడం, ఇతరులపై సెల్ ఫోన్‌లో అభ్యంతరకరమైన పోస్టులు పెట్టడం కూడా నేరంగానే పరిగణిస్తామని స్పష్టం చేశారు. ప్రధానంగా యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని సూచించారు. గంజాయి వంటి మాదకద్రవ్యాలు విక్రయించేవారి గురించి తెలిస్తే తమకు సమాచారం అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ సుధాకర్, గ్రామపెద్దలు ముత్యాలు, అమ్మోరయ్య తదితరులు పాల్గొన్నారు.

మునగపాక : డ్రగ్స్ వలన వాడే వ్యక్తితో పాటు ఆ కుటుంబం కూడా విచ్ఛిన్నమవుతుందని ఎస్ఐ పి.ప్రసాదరావు అన్నారు. మండలంలో నాగులాపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం డ్రగ్స్ వంటి మత్తుపానీయాలకు దూరంగా ఉండాలని అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డ్రగ్స్ తీసుకునే వ్యక్తులకు సమాజం గౌరవం ఇవ్వదన్నారు. ఆర్థికంగాను, ఆరోగ్యంగాను నష్టం, కష్టం చవిచూడాల్సి వస్తుందన్నారు. డ్రగ్స్‌కు గురించి ఎటు వంటి సమాచారం తెలిసినా పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు. విద్యార్థులు చక్కగా చదువుకుని ఉన్నత శిఖరాలకు చేరుకోవాలన్నారు.

'ఆంగ్ల భాషపై పట్టు సాధించాలి'

అచ్యుతాపురం, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థులు ఆంగ్ల భాషపై పట్టు సాధించాలని పరవాడ డీఎస్పీ విష్ణుస్వరూప్ అన్నారు. స్థానిక భవానీ విద్యానికేతన్‌లో శుక్రవారం జరిగిన పదవ తరగతి విద్యార్థులు, తల్లిదండ్రుల సమావేశంలో ముఖ్య అతిథిగా మాట్లాడారు. విద్యార్థులు డిక్షనరీలో ప్రతిరోజూ ఐదు కొత్త పదాలు నేర్చుకుంటే ఏడాదిలో ఆంగ్లలో పట్టు సాధించవచ్చన్నారు. వార్తా పత్రికలు చదవడంతో పాటు సంఘటనలను ఊహించుకుంటే జ్ఞాపక శక్తి పెరుగుతుందన్నారు. తెలుగులో ఆలోచించి ఆంగ్లంలో చెప్పే పద్ధతిని అలవరచుకోవాలన్నారు. అనంతరం ఐఐటీ శిక్షణలో ప్రతిభ చూపిన విద్యార్థులకు మార్కుల మెమోలను అందజేశారు. ఈ కార్యక్రమంలో కరస్పాండెంట్ కూండ్రపు సంతోష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

'హోం మంత్రిపై విమర్శలు తగవు'



మాట్లాడుతున్న టీడీపీ మండల అధ్యక్షుడు అమలకంటి అబద్ధం

ఎస్. రాయవరం, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అడ్డరోడ్డు వద్ద ప్రైవేట్ మెడికల్ ల్యాబ్‌ను హోం మంత్రి ఒత్తిడి చేసి అధికారులతో సీజ్ చేయించినట్టు వైసీపీ నియోజవర్గ ఇన్‌చార్జి కంబాల జోగులు చేసిన వ్యాఖ్యలు వాస్తవం కావని టీడీపీ మండల అధ్యక్షుడు అమలకంటి అబద్ధం అన్నారు. శుక్రవారం ఆయన వెంకటాపురంలో విలేకరులతో మాట్లాడారు. నిబంధనలకు విరుద్ధంగా నిర్వహిస్తున్న జ్యోతి ల్యాబ్‌పై సంబంధిత అధికారులు రెండు సార్లు నోటీసులు ఇచ్చినా నిర్వాహకులు సమాధానం ఇవ్వకపోవడంతోనే జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారులు ల్యాబ్‌ను గురువారం సీజ్ చేసినట్టు తెలిపారు. అలాంటిది ఎటువంటి అవగాహన లేనివారెవరో ఇచ్చిన స్క్రిప్ట్‌తో జోగులు తప్పుడుగా వ్యాఖ్యానించడం సిగ్గుచేటని విమర్శించారు. హోం మంత్రి అనిత నిత్యం ప్రజలకు సేవలందిస్తూ నియోజకవర్గ ప్రజల అభివృద్ధి కోసం పాటుపడుతున్నారని ఆయన స్పష్టం చేశారు. ల్యాబ్ విషయంలో చట్టం తన పని తాను చేస్తే తప్పు చేసిన వారిని ఎందుకు సపోర్టు చేస్తున్నారంటూ జోగులను అబద్ధం ప్రశ్నించారు. బల్క్‌డ్రగ్ పార్కు వైసీపీ ప్రభుత్వంలోనే వచ్చిందని, అప్పట్లో జగన్ అసెంబ్లీ సాక్షిగా ఎన్నో గొప్పలు కూడా చెప్పారని గుర్తు చేశారు. ఇప్పుడు విమర్శలు చేయడం విడ్డూరంగా ఉందన్నారు. ఎక్కడ నుంచో ఇన్‌చార్జిగా వచి కంబాల జోగులుకు ఇక్కడ నేతలను విమర్శించే అర్హత లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో పీఎస్‌సీస్ చైర్‌పర్సన్లు తుమ్మపాల నాగేశ్వరరావు, గుర్రం రామకృష్ణ, టీడీపీ మండల ప్రధాన కార్యదర్శి అల్లు నరసింహమూర్తి, ముప్పిన శ్రీనివాసరావు, కోన అప్పలరాజు పాల్గొన్నారు.

టెన్త్‌లో శత శాతం ఉత్తీర్ణతకు కృషి చేయాలి

- జిల్లా ఉప విద్యాశాఖాధికారి అప్పారావు



కొరుప్రోలు పాఠశాలలో విద్యార్థులతో ముచ్చటిస్తున్న అప్పారావు

ఎస్. రాయవరం, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): రానున్న పదో తరగతి పరీక్షలో శతశాతం ఉత్తీర్ణతకు కృషి చేయాలని జిల్లా ఉప విద్యాశాఖాధికారి పెన్నాడ అప్పారావు అన్నారు. మండలంలోని కొరుప్రోలు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను శుక్రవారం డీఈవో సందర్శించారు. ఈ సందర్భంగా పదో తరగతి విద్యార్థులతో ముచ్చటించారు. ప్రతీ సబ్జెక్టును ఏ విధంగా చదవాలి, పది పబ్లిక్ పరీక్షల్లో రాణించేందుకు ఎలా సన్నద్ధం కావాలి అనే పలు విషయాలపై అవగాహన కల్పించారు. అంతేకాకుండా గత సారి ఎస్ఏవన్ పరీక్షల్లో ఎంత శాతం మంది ఉత్తీర్ణత సాధించారు. మిగిలిన వారు ఏ అంశాలల్లో వెనుకబడి ఉన్నారు అన్న విషయాలను సంబంధిత ఉపాధ్యాయులనుంచి ఆరా తీశారు. వెనుకబడిన విద్యార్థుల కోసం ఎటువంటి యాక్షన్ ప్లాన్ తయారు చేసుకోవాలనే విషయంపై సూచించారు. అనంతరం ఉపాధ్యాయులతో సమావేశమై డిసెంబరు 6వ తేదీన పాఠశాలల్లో జరగనున్న మెగా పేరెంట్స్ మీ టింగ్‌తో పాటు విద్యార్థుల చదువుకు సంబంధించిన పలు విషయాలపై పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కప్పల ప్రసాద్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

'పేట'లో ఇళ్ల స్థలాలకు దరఖాస్తుల వెల్లువ

- నాలుగేళ్ల కిత్రం వైసీపీ ప్రభుత్వం అర్హులుగా గుర్తించిన 2,500 మందికి స్థలాలు మంజూరు
- కొత్తగా ఇళ్ల స్థలాల కోసం 3వేల మంది రిజిస్ట్రేషన్



రిజిస్ట్రేషన్ కోసం శ్రీరాంపురం పంచాయతీ కార్యాలయం వద్ద క్యూలో జనం

పాయకరావుపేట, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): పేదలకు ఇళ్ల మంజూరు కు రిజిస్ట్రేషన్ గడువు మరో రోజు మాత్రమే ఉండడంతో శుక్రవారం మండలంలో అన్ని సచివాలయాల ఎదుట లబ్ధిదారులు బారులు తీరారు. రాష్ట్రంలో ఇంటి స్థలం లేని వారికి 3 సెంట్లు, సొంతంగా స్థలం ఉన్న వారికి ఇల్లు మం జూరు కోసం రిజిస్ట్రేషన్లకు ఈనెల 30వ తేదీ వరకు ప్రభుత్వం గడువు ఇచ్చింది.. దీంతో కొద్దిరోజులుగా మండలంలోని అన్ని సచివాలయాల వద్ద రిజిస్ట్రేషన్ కోసం అధిక సంఖ్యలో ప్రజలు వస్తున్న విషయం తెలిసిందే. అయితే, ఈనెల 30వ తేదీ ఆదివారం కావడంతో మరొక రోజు మాత్రమే గడువు ఉండడంతో శుక్రవారం సచివాలయాల వద్ద ప్రజలు క్యూ కట్టారు. కొన్ని సచివాలయాల వద్ద రద్దీ మరీ ఎక్కువగా ఉండడంతో కొంతమందికి శనివారం రావాలంటూ టోకెన్లు ఇచ్చారు. హౌసింగ్ అధికారులు తెలిపిన వివరాల ప్రకారం శుక్రవారం సాయంత్రానికి మండలంలోని 24 పంచాయతీల్లో ఇంటి స్థలాల కోసం సుమారు 2వేల మంది, సొంత స్థలం ఉండి ఇల్లుమంజూరు కోసం సుమారు 500 మంది తమ వివరాలను రిజిస్ట్రేషన్ చేయించుకున్నారు. శనివారం సాయంత్రంలోగా మరో 500 పైగా దరఖాస్తులు వచ్చే అవకాశం ఉంది. అయితే శుక్రవారం మధ్యాహ్నం నుంచి సర్వర్ పనిచేయక రిజిస్ట్రేషన్ ఆగిపోవడంతో పట్టణంతోపాటు మండల గ్రామాల్లోని పలు సచివాలయాల్లో ప్రజల నుంచి దరఖాస్తులను స్వీకరించారు. గత వైసీపీ ప్రభుత్వంలోపాయకరావుపేట మండలంలో ఇళ్ల స్థలాల కోసం సుమారు 6,000 మంది దరఖాస్తు చేసుకోగా, వీరిలో సుమారు 2,500 మందిని అర్హులుగా గుర్తించారు. వీరిని వైసీపీ ప్రభుత్వం మండలంలో జగనన్న కాలనీలు ఏర్పాటుచేసి ఒక్కొక్కరికి సెంటున్నర స్థలం మంజూరుచేసిన విషయం తెలిసిందే. వీరికి స్థలాలు కేటాయించిన సుమారు నాలుగేళ్లు కాగా, ఇప్పటి వరకు సగం ఇళ్లు పూర్తికాలేదు.సుమారు 600 మంది ఇళ్ల నిర్మాణాలు ప్రారంభించలేదు. ఇపుడుకూటమి ప్రభుత్వంఅధికారంలోకి వచ్చిన తరువాత ఇళ్ల మంజూరు కోసం రిజిస్టేషన్ చేయించుకున్నవారు కూడా 3వేలకు పైగా ఉండే అవకాశం ఉంది.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



రేవుపోలవరంలో పూర్వ విద్యార్థులు

ఎస్. రాయవరం, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): గొలుగొండ ఏపీఎస్‌డబ్ల్యూఆర్ఎస్ (గురుకుల పాఠశాల)లో ఇంటర్ (1999-2001) చదివిన పూర్వ విద్యారులు శుక్రవారం మండలంలో గల రేవుపోలవరం సముద్రతీరంలో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. 25 ఏళ్ళ తరువాత కలిసిన వీరంతా సంతోషంతో ఒకరికినొకరు పలకరించుకున్నారు. తరువాత ఎవరెవరు ఏం చేస్తున్నారో తెలుసుకున్నారు. కళాశాలలో చదువుకొనే రోజుల్లో జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. అనంతరం ఆటపాటలతో గడిపారు. మధ్యాహ్నం విందు భోజనాలు చేశారు. అనంతరం తమలోని ఆర్థికంగా ఆదుకునేందుకు ఫ్రెండ్స్ ఫెరెవర్ అనే సంస్థను ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు సునీల్, తాతాజీ, బాల య్యదొర, ప్రసాద్, శ్రీను, ప్రకాష్ పాల్గొన్నారు.

హెచ్‌ఐవీ ఎయిడ్స్‌పై అవగాహన



మాట్లాడుతున్న ఐసీటీసీ అధికారిణి రమణమ్మ

నక్కపల్లి, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శుక్రవారం హెచ్‌ఐవీ, ఎయిడ్స్‌పై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ మల్లి శివయ్య ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో నక్కపల్లి సీహెచ్‌సీ ఐసీటీసీ అధికారిణి రమణమ్మ మాట్లాడుతూ, గతంతో పోల్చుకుంటే హెచ్‌ఐవీ ఎయిడ్స్ వ్యాప్తి తగ్గుముఖం పట్టిందన్నారు. ఎయిడ్స్ సోకిన వారి పట్ల వివక్షత తగదన్నారు. వ్యాధి సోకకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వివరించారు. హెచ్‌ఐవీ ఎయిడ్స్ చికిత్సా విధానాలను వివరించారు.

సుబ్బరాజు సాధువు భూములు శివాలయానికి కేటాయించాలి

- ప్రజా సమస్యల వేదికలో సామాజిక కార్యకర్త సోమిరెడ్డి రాజు వినతులు



కొన్ని నెలల క్రితం మృతి చెందిన సుబ్బరాజు సాధువు (ఫైల్)

ఎస్. రాయవరం, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గెడ్డపాలెం గ్రామానికి చెందిన వారసులు ఎవరూ లేని కె. సుబ్బరాజు అనే సాధువుకు చెందిన తిమ్మాపురం రెవెన్యూ పరిధిలో ఉన్న దాదాపు మూడున్నర ఎకరాల ఆస్తులను ప్రభుత్వం స్వాధీనం చేసుకుని, వాటిని గ్రామంలోని శివాలయం అభివృద్ధికి కేటాయించాలని కోరుతూ శుక్రవారం అమరావతిలోని ముఖ్యమంత్రి ప్రజా సమస్యల పరిష్కార వేదికతోపాటు స్థానిక తహశీల్దార్‌కు వినతులు అందజేసినట్టు సామాజిక కార్యకర్త సోమిరెడ్డి రాజు ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, సుబ్బరాజు అనే వ్యక్తి చాలా ఏళ్ల క్రితం వేరే ప్రాంతం నుంచి గెడ్డపాలెం వచ్చి ఇక్కడ స్థిరపడి గ్రామ శివారులోని శివాలయం వద్ద ఉంటూ ప్రజలకు మంచి, చెడులు చెబుతూ సాధువుగా పేరుగాంచారన్నారు. అప్పట్లో సుబ్బరాజు శివాలయాన్ని అభివృద్ధి చేస్తానని చెప్పడంతో గ్రామస్థులు కొంత భూమిని ఆయనకు ఇచ్చారని రాజు చెప్పారు. కొన్నాళ్ల తరువాత రెవెన్యూ అధికారులు ఈ భూములను అతడి పేరున రికార్డుల్లో ఎక్కించడంతోపాటు పాసుపుస్తకం కూడా మంజూరు చేశారన్నారు. అయితే. సాధువుగా సుబ్బరాజు ఇటీవల కొన్ని నెలల క్రితం మృతి చెందారని, అయితే, సాధువు వద్ద కూలి పనులు చేసిన గ్రామానికి చెందిన ఓ వ్యక్తి ఆ భూములను సాగు చేసుకుంటున్నారన్నారు. అం దు వల్ల సంబంధిత ఉన్నతాధికారులు ఈ విషయంపై విచారణ చేపట్టి ఈ భూములను ప్రభుత్వం స్వా ధీనం చేసుకొనిఅనంతరం గతంలో సాధువు గ్రామస్థులకు ఇచ్చిన వాగ్దానం మేరం శివాలయం అభివృద్ధికి సహకరించాలని కోరారు.


అరట్లకోటలో కూటమి కార్యాలయం ప్రారంభం



కార్యాలయం ప్రారంభిస్తున్న టీడీపీ నాయకులు

పాయకరావుపేట రూరల్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అరట్లకోట గ్రామంలో గురువారం రాష్ట్ర కాపు కార్పొరేషన్ డైరక్టరు పెదిరెడ్డి చిట్టిబాబు, టీడీపీ మండల అధ్యక్షుడు చించలపు ప్రదీప్, నాయకులు ఎన్‌డీఏ పార్టీల కార్యాలయం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పేదలకు కూటమి ప్రభుత్వం అండగా ఉంటుందన్నారు. అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందుతున్నాయన్నారు. గ్రామస్థులకు ఏ సమస్య వచ్చినా కార్యాలయానికి వచ్చి ఫిర్యాదు చేస్తే రాష్ట్ర హోం మంత్రి అనిత దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ పట్టణ అధ్యక్షుడు యాళ్ళ వరహాలు, ఏఎంసి వైస్ చైర్మన్ కంకిపాటి వెంకటేశ్వరరావు, టీడీపీ నాయకులు బొండి కాశీవిశ్వనాద్, గారా కృష్ణప్రసాద్, కట్టా శ్రీను, వేములపూడి అప్పారావు, దువ్వు శ్రీనివాస్, తుమ్మల బాబ్జీ, కుందూరు కుమార్, జనసేన నాయకుడు తుమ్మల గణేశ్, తదితరులు పాల్గొన్నారు.

ఐదుగురు పేకాటరాయుళ్లు అరెస్టు



పేకాట ఆడుతున్నవారిని అదుపులోకి తీసుకున్న పోలీసులు

పాయకరావుపేట రూరల్, 28 (ఆంధ్రజ్యోతి) : పాయకరావుపేట పోలీసులు శుక్రవారం మండలంలోని గుంటపల్లి శివారు ప్రాంతంలో దాడులుచేసి పేకాట ఆడుతున్న ఐదుగురు వ్యక్తులు అదుపులోకి తీసుకున్నారు. వీరి నుంచి రూ.9,530ల నగదుతోపాటు రెండు బైక్‌లకు స్వాధీనం చేసుకున్నారు. ఇందుకు సంబంధించి సీఐ జి.అప్పన్న వివరాలు అందించారు. పక్కా సమాచారంతో శుక్రవారం గుంటపలి శివారు ప్రాంతంలో ఎస్ఐ పురుషోత్తం సిబ్బందితో దాడు లు చేశారు. రూ.9,530ల నగదుతోపాటు రెండు ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకుని స్టేషన్‌కి తరలించారు. నిందితులపై సస్పెక్ట్ షీట్ ఓపెన్ చేయడానికి ఏర్పాట్లు చేస్తున్నట్టు సీఐ వివరించారు. మండలంలో ఎక్కడైనా కోడి పందాలు, పేకాట, గుండాట ఆడుతున్నట్టు సమాచారం ఇస్తే తగిన బహుమతి అందిస్తామని ఆయన తెలిపారు. అలాగే, సమాచారం ఇచ్చినవారి వివరాలు గోప్యంగా ఉంచుతామని సీఐ తెలిపారు.

ఇరుకు మయం.. మలుపుల భయం!

▸▸ ప్రమాదకరంగా సబ్బవరం- దువ్వాడ రోడ్డు ▸▸ నిత్యం రద్దీగా ఉంటుండడంతో ప్రమాదాలు ▸▸ వెడల్పుతో పాటు హెచ్చరిక బోర్డులు, రేడియం స్టిక్కర్ల ఏర్పాటుకు వినతి



అమృతపురం సమీపంలో...



అమృతపురం- అమరపినివానిపాలెం మధ్య ఉన్న ప్రమాదకర మలుపు



అమరపినివానిపాలెం- దువ్వాడ రోడ్డులో...

సబ్బవరం, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రం సబ్బవరం నుంచి దువ్వాడ వెళ్లే రోడ్డు ప్రమాదకరంగా మారింది. ఎక్కడికక్కడ మలుపులు ఉండడంతో ఎప్పుడు ఏం జరుగుతుందో తెలియని పరిస్థితి నెలకొంది. చోడవరం రోడ్డు నుంచి గొర్లివానిపాలెం, కొత్తరోడ్డు, పెదనాయుడుపాలెం, తవ్వవానిపాలెం, అమృతపురం మీదుగా గొల్లలపాలెం, దువ్వాడ వెళ్లే రోడ్డులో ప్రమాదకరమైన మలుపులు ఉండడంతో నిత్యం ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. దశాబ్దాల క్రితం అప్పటి అవసరాల మేరకు ఈ రోడ్డును నిర్మించారు. మొదట పంచాయతీరాజ్ పరిధిలో మట్టిరోడ్డు ఉండేది. అప్పట్లో ఈ రోడ్డు అభివృద్ధికి నోచుకోకపోవడంతో నాటి రాష్ట్ర మంత్రి బండారు సత్యనా రాయణమూర్తి ఆర్అండ్బీ శాఖలో విలీనం చేయించి తారు రోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరు చేయించారు. అప్పటి నుంచి రాకపోకలు పెరిగాయి. గత పదేళ్లగా గాజువాక, స్టీల్ ప్లాంటు, దువ్వాడ రైల్వేస్టేషన్, కూర్మన్నపాలెం తదితర ప్రాంతాలు వేగంగా అభివృద్ధి చెందడంతో ఈ రోడ్డు ప్రాముఖ్యం పెరిగింది. నిత్యం వందలాది వాహనాలు రాకపోకలు సాగిస్తున్నాయి. సబ్బవరంతో పాటు విజయనగరం జిల్లా నుంచి కొత్తవలస మీదుగా దువ్వాడ, గాజువాక వెళ్లే వాహనాలు పెందుర్తి, గోపాలపట్నం నుంచి దువ్వడ కూర్మన్నపాలెం, స్టీల్ ప్లాంట్‌కు రాకపోకలు సాగించే వాహనాల సంఖ్య పెరిగింది. ఈ రోడ్డు ఇరుకుగా ఉండడంతో పాటు అమృతపురం, అమరపినివానిపాలెం, గొల్లలపాలెం, తవ్వవానిపాలెం గ్రామాల మధ్య సుమారు పదిహేను చోట్ల మలుపులు ఉండడంతో నిత్యం ప్రమాదాలు బారిన పడుతున్నారని ఆయా గ్రామాల ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ రోడ్డును వెడల్పు చేయడంతో పాటు, ప్రమాదకర మలుపుల వద్ద హెచ్చరిక బోర్డులు, రేడియం స్టిక్కర్లు ఏర్పాటు చేయాల్సి ఉన్నప్పటికీ ఆ దిశగా అధికారులు చర్యలు చేపట్టలేదని పలువురు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈ రోడ్డును వెడల్పు చేయాలన్న డిమాండ్ ఎప్పటి నుంచో ఉందని స్థానిక నేతలు చెబుతున్నారు. అభివృద్ధికి అనుగుణంగా రోడ్డు విస్తరిస్తే రోడ్డుకు అనుకొని ఉన్న గ్రామాలు మరింత అభివృద్ధి చెందుతాయని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

'పురమిత్ర' ద్వారా అన్ని సేవలు

▸▸ యాప్‌ను అంతా డౌన్ లోడ్ చేసుకోవాలి

▸▸ పట్టణ ప్రజలకు జీవీఎంసీ జోనల్ కమిషనర్ చక్రవర్తి సూచన



ఎన్టీఆర్ స్టేడియంలో వాకర్స్‌తో మాట్లాడుతున్న జడ్సీ చక్రవర్తి

అనకాపల్లి టౌన్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి) : పురమిత్ర యాప్‌ను అంతా సద్వినియోగం చేసుకోవాలని జీవీఎంసీ జోనల్ కమిషనర్ కె.చక్రవర్తి కోరారు. ఎన్టీఆర్ స్టేడియాన్ని శుక్రవారం ఉదయం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా వాకర్స్‌తో మాట్లాడుతూ జీవీఎంసీకి సంబంధించిన అన్ని సర్వీసులు పురమిత్ర యాప్‌లో ఉంటాయని తద్వారా ఎవరికి ఏ సర్వీసు అవసరమైన ఆ యాప్ ద్వారా సద్వినియోగం చేసుకోవచ్చునన్నారు. ఈ సందర్భంగా వాకర్స్ పలు సమస్యలను ఆయన దృష్టికి తీసుకువచ్చారు. మైదానమంతా అధ్వానంగా ఉందని గోతులమయం కావడం వల్ల వాకింగ్‌కు సరిగా లేకపోవడమే కాకుండా క్రీడాకారులు ఆటలు ఆడుకోవడానికి కూడా ఇబ్బందులు ఎదురవుతున్నాయని వివరించారు. స్టేడియంలో విద్యుత్ లైట్ల వెలుగులు సరిపోలేదని పెంచాలని కోరారు. అలాగే తాగునీటిని అందుబాటులోకి తీసుకురావాలని కోరగా బోరువెల్‌కు విద్యుత్ కనెక్షన్ ఏర్పాటు చేసి తాగునీటిని అందుబాటులోకి తీసుకువస్తామని కమిషనర్ స్పష్టం చేశారు. ఆగస్టులో వినాయక విగ్రహం ఏర్పాటు చేసినప్రదేశం అధ్వానంగా ఉందని దానిని సరిచేయాలని వాకర్స్ విజ్ఞప్తి చేశారు. ఇదిలా వుండగా విజయరామరాజుపేట అండర్ బ్రిడ్జి వద్ద ఇరువైపులా రైల్వేశాఖ ఏర్పాటు చేసిన స్పీడ్ బ్రేకర్లను కమిషనర్ పరిశీలించారు. రైల్వే అధికారులు వేసిన స్పీడ్ బ్రేకర్ల వల్ల వాహనచోదకులు పడుతున్న ఇబ్బందులను గుర్తించారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు తక్షణమే స్పీడ్ బ్రేకర్లను సరిచేయాలని జడ్సీ రైల్వే అధికారులకు సూచించారు.

3న అగ్రిగోల్డ్ బాధితుల ఆవేదన దీక్ష



సమావేశంలో మాట్లాడుతున్న వైఎస్ భద్రం

తుమ్మపాల, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి) : అగ్రిగోల్డ్ బాధితులకు న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ డిసెంబరు మూడో తేదీన విజయవాడలో నిర్వహించనున్న అగ్రిగోల్డ్ బాధితుల ఆవేదన దీక్షను విజయవంతం చేయాలని అగ్రిగోల్డ్ కస్టమర్స్ అండ్ ఏజెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ గౌరవాధ్యక్షుడు వైఎస్ భద్రం పిలుపునిచ్చారు. శుక్రవారం ఇక్కడ జరిగిన సమావేశంలో మాట్లాడారు. పదకొండు సంవత్సరాలుగా ఎనిమిది రాష్ట్రాలకు చెందిన 32లక్షల మంది అగ్రిగోల్డ్ బాధితులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నా ప్రభుత్వాలు పట్టించుకోకపోవడం అన్యాయమన్నారు. సుమారు 600 మంది బాధితులు ఆత్మహత్యలకు పాల్పడగా, పెద్ద సంఖ్యలో మనోవేదనతో పలువురు మృతి చెందారన్నారు. తక్షణమే అగ్రిగోల్డ్ సంస్థకు సంబంధించిన ఆస్తులను ప్రభుత్వం స్వాధీనపరచుకొని బాధితులకు న్యాయం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ నాయకులు మొల్లేటి గోపాలరమణ, జెర్రిపోతుల దుర్గారావు, ఎం.చినఅప్పారావు, కొణతాల శ్రీనివాసరావు, మత్తు సూరిబాబు, జి.వెంకటేశ్వరరావు, ఎస్.అప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు.

బొజ్జన్నకొండను అభివృద్ధి చేయాలని నిరసన



నిరసన తెలుపుతున్న అసోసియేషన్ ప్రతినిధులు

తుమ్మపాల, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి) : ప్రముఖ బౌద్ధ క్షేత్రం బొజ్జన్నకొండ అభివృద్ధిపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తక్షణమే దృష్టి సారించాలని సిద్ధార్థ సోషల్ సర్వీసెస్ అండ్ కల్చరల్ అసోసియేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు బల్లా నాగభూషణం డిమాండ్ చేశారు. ఈ మేరకు అసోసియేషన్ ప్రతినిధులతో కలిసి శుక్రవారం బొజ్జన్నకొండ వద్ద నిర్మించిన హరిత రిసార్ట్స్ వద్ద నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. బొజ్జన్నకొండ వద్ద పలు అభివృద్ధి పనులను ప్రారంభించి పదిహేను నెలలు గడుస్తున్నా అందుబాటులోకి రాకపోవడం దారుణమన్నారు. నిత్యం పర్యాటకులతో కళకళలాడే బొజ్జన్నకొండ వద్ద వసతుల లేమితో పర్యాటకులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. ప్రభుత్వాలు తక్షణమే స్పందించాల్సిందిగా కోరారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ ప్రతినిధులు వినకోట నీలేష్ గుప్తా, రొబ్బి మల్లేశ్వరరావు, బండి అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

ప్రణాళికాబద్ధంగా చదివితే ఉత్తమ ఫలితాలు



విద్యార్థులకు సూచనలు చేస్తున్న రాంకీ ఫౌండేషన్ డిప్యూటీ హెడ్ శ్రీకాంత్

పరవాడ, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థులు ప్రణాళికాబద్ధంగా చదివితే ఉత్తమ ఫలితాలు సాధ్యమని రాంకీ ఫౌండేషన్ డిప్యూటీ హెడ్ కె.శ్రీకాంత్ అన్నారు. మండలంలోని వాడచీపురుపల్లి హైస్కూల్‌లో తొమ్మిది, పది తరగతుల విద్యార్థులకు శుక్రవారం రాంకీ ఫౌండేషన్, మ్యాజిక్‌బస్సు ఇండియా సంస్థ సంయుక్త ఆధ్వర్యంలోని కెరీర్ గైడెన్స్‌పై ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. విద్యార్థి దశ నుంచే ప్రశ్నించే మంచి లక్ష్యాలు ఏర్పరుచుకోవాలన్నారు. విద్యపై దృష్టి సారిస్తేనే భవిష్యత్తులో ఉన్నత శిఖరాలను అధిరోహించవచ్చునన్నారు. విద్యార్థులకు పదో తరగతి చాలా కీలకమని, ప్రణాళికాబద్ధంగా చదివి మంచి ఫలితాలు సాధించాలని ఆకాంక్షించారు. మ్యాజిక్ బస్సు ఇండియా సంస్థ మేనేజర్ శ్రీలక్ష్మి, పాఠశాల హెచ్‌ఎం ఎన్.శ్రీనివాసరావు, రాంకీ పౌండేషన్ ప్రతినిధి శ్రీనివాసరెడ్డి, స్వప్న, గాయత్రి, ఉపాధ్యాయులు సౌజన్య, అరుణ, జ్యోతి పాల్గొన్నారు.

పల్లెలపై మంచు దుప్పటి



చెట్టుపల్లిలో దట్టంగా కురుస్తున్న మంచు

నర్సీపట్నం అర్బన్, నవంబరు 28(ఆంధ్రజ్యోతి) : మండలంలో తీవ్ర చలితో పాటు దట్టంగా కురుస్తున్న మంచుతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. శుక్రవారం ఉదయం చెట్టుపల్లి, వేములపూడి, ఓఎల్‌పురం, గబ్బాడ తదితర గ్రామాల్లో మంచు దట్టంగా కురిసింది. ఏజెన్సీ ప్రాంతాన్ని తలపించేలా మైదాన ప్రాంతంలో కూడా దట్టంగా మంచుకురిసింది. దీంతో రోడ్లన్నీ కనిపించకుండా మంచుతో కప్పేసింది. వాహనదారులు లైట్లు వేసుకుని రాకపోకలు సాగించారు.

జ్యోతిరావు పూలేకు నివాళి



పూలే చిత్రపటం వద్ద ఐద్వా ప్రతినిధుల నివాళి

పరవాడ, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి) : స్థానిక టిడ్కో కాలనీలో శుక్రవారం ఐద్వా ఆధ్వర్యంలో మహాత్మా జ్యోతిరావు పూలే వర్ధంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. తొలుత ఆయన చిత్రపటానికి ఐద్వా జిల్లా జాయింట్ సెక్రటరీ తుంపాల అన్నపూర్ణ పూలమాల వేసి నివాళులర్పించారు. బడుగు, బలహీనవర్గాల అభ్యున్నతికి జ్యోతిబాపూలే చేసిన కృషి శ్లాఘనీయమన్నారు. ఐద్వా ప్రతినిధులు ఎం.బంగారమ్మ, వరహాలమ్మ, బేగం, గోపాలరావు, కనకమహాలక్ష్మి, అబద్ధం, రమణమ్మ పాల్గొన్నారు.

గురుకుల విద్యాలయానికి క్రీడా పరికరాలు



విద్యా, క్రీడాపరికరాలతో విద్యార్థులు, ఉపాధ్యాయులు

సబ్బవరం, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి) : ఇక్కడి బీఆర్ అంబేడ్కర్ గురుకులం పూర్వ విద్యార్థులు తమ సౌదార్యాన్ని చాటుకుటున్నారు. 'పే బ్యాక్ టు సొసైటీ' పేరిట శుక్రవారం ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. పాఠశాలకు అవసరమైన విద్యా, క్రీడా పరికరాలను అందజేశారు. ఈ సందర్భంగా వైస్ ప్రిన్సిపాల్ కె.చిరంజీవి మాట్లాడుతూ గురుకులం పాలిటెక్నిక్ కళాశాల లెక్చరర్ ఎస్‌వీ రమణ, సర్కిల్ ఇన్‌స్పెక్టర్ అయిన విద్యాసాగర్, రఘురామ్ హోండా డీలర్ స్వరూప్ తదితరులు పే బ్యాక్ టు సొసైటీ పేరిట విద్యార్థులకు అవసరమైన రూ.40 వేలు విలువ చేసే పుస్తకాలు, క్రీడా పరికరాలు అందజేశారని వారిని అభినందించారు. ఉపాధ్యాయులు కె.గోవిందరావు, పి.సత్యనారాయణ, పార్థసారధి, జానకీరామ్ తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో మహాలక్ష్మీ సహిత రుద్రహోమం



మహాలక్ష్మీ సహిత రుద్రహోమంలో భక్తులు

సబ్బవరం, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి) : మార్గశిర మాసోత్సవాల్లో భాగంగా మండల ప్రజల ఆరాధ్య దేవత స్థానిక దుర్గమాంబ ఆలయంలో శుక్రవారం మహాలక్ష్మీ సహిత రుద్రహోమాన్ని అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. వేకువజామున అమ్మవారికి పంచామృతాభిషేకం, సహస్ర కుంకుమార్చన వంటి వాటిని జరిపించారు. ఈ వేడుకల్లో వివిధ గ్రామాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

సీఎం సహాయ నిధి మంజూరు పత్రాల పంపిణీ



సీఎం సహాయ నిధి మంజూరు పత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే కొణతాల

కొత్తూరు, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి) : అనారోగ్యానికి గురైన పలువురికి ముఖ్యమంత్రి సహాయ నిధి మంజూరు పత్రాలను ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ అందజేశారు. అనకాపల్లి పట్టణంలోని రింగురోడ్డులో ఉన్న జనసేన కార్యాలయంలో శుక్రవారం జరిగిన ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. అనారోగ్యం బారిన పడి ఖరీదైన వైద్యం చేయించుకోలేని వారికి సీఎం సహాయ నిధి ఎంతో ఉపయోగపడుతుందన్నారు. కూటమి అధికారంలోకి వచ్చిన పదహారు నెలల కాలంలో వందలాది మందికి చెక్కులను అందజేశామన్నారు. నియోజకవర్గ ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటానని, ఎటువంటి సమస్యలున్నా తమ దృష్టికి తీసుకువస్తే పరిష్కరిస్తానని ఆయన స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

భోగలింగేశ్వర ఆలయ హుండీ ఆదాయం లెక్కింపు



హుండీ ఆదాయం లెక్కిస్తున్న దృశ్యం

అనకాపల్లి టౌన్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని కోటమీద గల సర్వకామదాంబ సమేత భోగలింగేశ్వరస్వామి ఆలయ హుండీ లెక్కింపు శుక్రవారం ఆలయ మండపంలో చేపట్టారు. భక్తులు కానుకల రూపంలో హుండీ ఆదాయం రూ. లక్షా 15,022, టికెట్‌ల ద్వారా రూ.లక్షా 76,190లు వచ్చిందని ఆలయ చైర్మన్ కాండ్రేగుల సత్యనారాయణ తెలిపారు. ఈ ఆదాయం ఎనిమిది నెలలకు వచ్చిందన్నారు. ఈవో ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు మద్దాల నారాయణరావు, యలమంచిలి బంగార్రాజు తదితరులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన



మహిళా ప్రయాణికులతో మాట్లాడుతున్న ట్రాఫిక్ సీఐ వెంకటనారాయణ



కశింకోటలో అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న పోలీసులు



పరవాడ ఫార్మా పరిశ్రమలో మాట్లాడుతున్న సీఐ మల్లికార్జునరావు

అనకాపల్లి టౌన్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి) : ఆటోల్లో ప్రయాణించేటప్పుడు జాగ్రత్తలు పాటించాలని ట్రాఫిక్ సీఐ ఎం.వెంకటనారాయణ సూచించారు. శుక్రవారం రాత్రి పట్టణంలో మహిళా కార్మికులకు చట్టాలపై ఏర్పాటైన అవగాహన సదస్సులో మాట్లాడారు. కూలిపనికి వచ్చి తిరిగి సాయంత్రం వేళల్లో ఆటోల్లో ఇళ్లకు వెళ్తున్నప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. అనుక్షణం అప్రమత్తంగా ఉండాలన్నారు. ఆటోల్లో పరిమితికి మించి ఎక్కి ప్రమాదాలకు గురికారాదన్నారు. అలాగే, ఆటో డ్రైవర్లు కూడా నిబంధనలను విధిగా పాటించాలన్నారు. ఈ కార్యక్రమంలో ట్రాఫిక్ ఎస్ఐ అర్జునతో పాటు సిబ్బంది పాల్గొన్నారు.

కశింకోటలో...

కశింకోట : మండల కేంద్రమైన కశింకోటలో రోడ్డు భద్రతపై శుక్రవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ అల్లు స్వామినాయుడు మాట్లాడుతూ రోడ్డుపై ప్రయాణించేటప్పుడు ప్రమాదాల బారిన పడకుండా ఉండాలంటే ఏ విధమైన జాగ్రత్తలు తీసుకోవాలో వివరించారు. ద్విచక్ర వాహనదారులు ప్రయాణించేటప్పుడు తప్పకుండా హెల్మెట్ ధరించాలని సూచించారు. నాలుగు చక్రాల వాహనదారులు సీటు బెల్టు ధరించాలని, ట్రిపుల్ రైడింగ్, మద్యం సేవించి వాహనం నడపడం వంటివి చేయరాదన్నారు. ముఖ్యంగా డ్రైవింగ్ సమయంలో మొబైల్‌లో మాట్లాడరాదని స్పష్టం చేశారు. నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐలు మనోజ్‌కుమార్, లక్ష్మణ్, సిబ్బంది పాల్గొన్నారు.

పరవాడలో...

పరవాడ: ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలను విధిగా పాటించాలని సీఐ ఆర్.మల్లికార్జునరావు సూచించారు. ఇక్కడి ఫార్మాసిటీలోని అడ్మిరాన్ ఫార్మా పరిశ్రమలో శుక్రవారం రహదారి భద్రతపై ఏర్పాటు చేసిన అవగాహన సదస్సులో మాట్లాడారు. మద్యం తాగి వాహనాలను నడపరాదన్నారు. ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, కారులో ప్రయాణించేవారు విధిగా సీటు బెల్టు పెట్టుకోవాలన్నారు. మితిమీరిన వేగంతో వాహనాలు నడపరాదని, సెల్‌ఫోన్ డ్రైవింగ్ ఎట్టి పరిస్థితుల్లో చేయరాదన్నారు. నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తప్పవన్నారు. ఈ కార్యక్రమంలో ప్లాంట్ మేనేజర్ భాస్కర్‌రెడ్డి, ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

213 మందికి వైద్య పరీక్షలు



రోగులకు మందులు అందజేస్తున్న ప్రతినిధులు

కశింకోట, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని సోమవరం గ్రామంలో శుక్రవారం ఏర్పాటైన ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు జన్మదిన వేడుకల్లో భాగంగా ఏర్పాటు చేసిన ఈ శిబిరాన్ని రాష్ట్ర తెలుగు రైతు అధికార ప్రతినిధి, టీడీపీ అధ్యక్షుడు మండల గొంతిన శ్రీనివాసరావు ముఖ్య అతిథిగా ప్రారంభించారు. రోగులకు పరీక్షల అనంతరం అవసరమైన మందులు అందజేశారు. అనంతరం గంటా యువసేన ప్రతినిధులు ఏర్పాటు చేస్తున్న సేవా కార్యక్రమాలను చూసి అభినందించారు. రోగులకు పండ్లు, బిస్కెట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో గంటా యువసేన కన్వీనర్ జెర్రిపోతుల నూకునాయుడు, గొంతిన గంగాధర్, కూటమి నాయకులు పాల్గొన్నారు.

'తుఫాన్ హెచ్చరిక నేపథ్యంలో వరి కోతలు నిలిపివేయండి'

మాకవరపాలెం, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): ప్రస్తుతం వరి కోతలు నిలిపివేయాలని మండలంలో వ్యవసాయాధికారి డి.అప్పారావు తెలిపారు. ఈ నెల 30వ తేదీన తుఫాన్ రానున్న సందర్భంగా వరి కోతలు విరమించుకోవాలన్నారు. ఇప్పటికే కోతకు వరి సాగు సిద్ధమైనా కోయవద్దని సూచించారు. మాకవరపాలెం, కొండల అగ్రహారం, తామరం, గిడుతూరు, బయ్యవరం తదితర గ్రామాల్లో వరి కోతలు నిలిపివేయాలని రైతులకు సూచించారు. అలాగే పొలాల్లో నీరు ఎక్కువగా ఉంటే తొలగించాలన్నారు. వ్యవసాయానికి సంబంధించి ఎటువంటి సందేహాలు ఉన్నా వెంటనే వ్యవసాయ కార్యాలయాన్ని సందర్శించాలన్నారు.

స్పీడ్ బ్రేకర్ల సమస్యకు పరిష్కారం

▸▸ రైల్వే అధికారుల దృష్టికి కూటమి నేతలు తీసుకు వెళ్లడంతో వెంటనే స్పందన

▸▸ విజయరామరాజుపేట అండర్ బ్రిడ్జి వద్ద బ్రేకర్ల మధ్య సిమెంటు కాంక్రీట్ ఏర్పాటు



అధ్వానంగా ఉన్న స్పీడ్ బ్రేకర్



స్పీడ్ బ్రేకర్ల మధ్యలో ప్రస్తుతం సిమెంట్ కాంక్రీట్ వేసిన దృశ్యం

అనకాపల్లి టౌన్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి) : భారీ వాహనాలు విజయరామరాజుపేట అండర్ బ్రిడ్జి వద్ద గల ఐరన్ గడ్డర్లను అతి వేగంగా వచ్చి ఢీకొనకుండా ఉండేందుకు రైల్వేశాఖ అండర్‌బ్రిడ్జికి ఇరువైపులా వేసిన స్పీడ్ బ్రేకర్ల వల్ల వాహనచోదకులకు పెద్ద సమస్య తలెత్తింది. గత రెండు రోజుల నుంచి వాహనచోదకులు అండర్‌బ్రిడ్జి దాటడానికి తీవ్ర ఇబ్బందులు పడ్డారు. కూటమి నాయకులు, వైసీపీ నాయకులు కూడా ఈ స్పీడ్ బ్రేకర్లను రైల్వే అధికారులు నిబంధనలకు విరుద్ధంగా ఏర్పాటు చేసి వాహనచోదకులను ఇబ్బందులకు గురిచేశారని పేర్కొన్నారు. కూటమి నాయకులు ఈ సమస్యను ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ దృష్టికి తీసుకు వెళ్లారు. ఇదే విషయం జిల్లా కలెక్టర్ దృష్టికి కూడా వెళ్లినట్లు తెలిసింది. ఉదయం జీవీఎంసీ జోనల్ కమిషనర్ కె.చక్రవర్తి, గవర కార్పొరేషన్ చైర్మన్ మళ్ల సురేంద్ర, కూటమి నాయకులు స్పీడ్ బ్రేకర్లను పరిశీలించారు. తక్షణమే స్పీడ్ బ్రేకర్ల మధ్య ఉన్న ఖాళీ ప్రదేశాన్ని సిమెంట్ కాంక్రీట్‌తో లెవల్ చేసి వాహన చోదకుల రాకపోకలకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలని రైల్వే అధికారులకు సూచించారు. రైల్వే అధికారులు ఇక్కడి పరిస్థితులను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకు వెళ్లడంతో మధ్యాహ్నం నుంచి రెండు స్పీడ్‌బ్రేకర్లకు మధ్య ఉన్న ఖాళీ స్థలాన్ని సిమెంట్ కాంక్రీట్‌తో లెవల్ చేశారు. దీనివల్ల రాకపోకలకు ఇబ్బందులకు చెక్ పడినట్లైంది.

రైతును రాజుగా చేయడమే ప్రభుత్వ లక్ష్యం

» జీసీసీ చైర్మన్ కిడారి శ్రావణ్ కుమార్


రైతన్నా.. మీకోసం సభలో మాట్లాడుతున్న శ్రావణ్ కుమార్, పక్కన మాజీ ఎమ్మెల్యే గిడ్డి ఈశ్వరి, అధికారులు

పాడేరురూరల్, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): రైతును రాజును చేయడమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని జీసీసీ చైర్మన్ కిడారి శ్రావణ్ కుమార్ అన్నారు. టీడీపీ పాడేరు ఇన్‌చార్జి గిడ్డి ఈశ్వరి ఆధ్వర్యంలో గుత్తులపుట్టులో శుక్రవారం నిర్వహించిన రైతన్నా.. మీకోసం కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ప్రతీ రైతు ఆర్థికంగా ఎదగాలన్నదే ముఖ్యమంత్రి చంద్రబాబు సంకల్పమన్నారు. రైతుల కోసం అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నారన్నారు. రైతన్నా.. మీకోసం కార్యక్రమం ద్వారా ప్రతీ ఇంటికి వెళ్లి పంటల ప్రయోజనాలు, రైతు ఆర్థికాభివృద్ధికి చేయాల్సిన చర్యలను వివరిస్తున్నామన్నారు. డిమాండ్ ఆధారిత పంటలైన రాగులు, జొన్నలు, సజ్జలు, కొర్రలు సాగుకు ప్రోత్సాహం అందిస్తున్నట్టు పేర్కొన్నారు. ప్రకృతి వ్యవసాయంచేయాలన్నారు. ఫుడ్ ప్రోసెసింగ్ రంగంలో భారీ పెట్టుబడులు రాబడుతున్నాయని, ఇప్పటికే సీఐఐ సదస్సులో రూ. 13 వేల కోట్లు పెట్టుబడులతో 38 ఫుడ్ ప్రోసెసింగ్ యూనిట్ల కోసం ఎంవోయూలు కుదిరాయన్నారు. రాష్ట్రంలో ఎంఎస్ఎంఈలను ఏర్పాటు చేసి వ్యవసాయ ఉత్పత్తుల విలువ పెంచేందుకు ప్రభుత్వం ముందుకు సాగుతుందన్నారు. పీఎం కిసాన్ రెండవ విడతలో 46,86,838 రైతు కుటుంబాలకు రూ. 14 వేలు చొప్పున రూ. 63.10 కోట్లు సహాయం ప్రభుత్వం అందించినట్టు వివరించారు. 2047 నాటికి రాష్ట్రాన్ని రూ.308 కోట్ల ఆర్థిక వ్యవస్థగా మార్చి, తలసరి ఆదాయాన్ని రూ. 55 లక్షలకు పెంచే లక్ష్యంతో పనిచేస్తున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో జీసీసీ డైరెక్టర్ బొర్రా నాగరాజు, స్థానిక అధికారులు, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

క్రీడా పోటీలు ప్రారంభం


పోటీలను ప్రారంభిస్తున్న డీఎస్‌డీవో జగన్మోహనరావు

పాడేరురూరల్, నవంరుఒ 28(ఆంధ్రజ్యోతి): పాడేరు తలారిసింగి పాఠశాల ప్రాంగణంలో విభిన్న ప్రతిభావంతుల క్రీడా పోటీలను శుక్రవారం నిర్వహించినట్టు జిల్లా క్రీడలాభివృద్ధి అధికారి ఎ.జగన్మోహనరావు తెలిపారు. చెస్, రన్నింగ్, షాట్‌పుట్, బ్యాడ్మింటన్ నిర్వహించిన పోటీలకు డివిజన్ పరిధిలోని వివిధ మండలాలకు చెందిన 40 మంది విభిన్న ప్రతిభావంతులు పాల్గొన్నారన్నారు. బ్యాడ్మింటన్ విభాగంలో విజేతలుగా నిలిచిన విద్యార్థులను రాష్ట్ర స్థాయి పోటీలకు పంపించేందుకు చర్యలు చేపట్టామన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్‌జీఎఫ్ఐ జిల్లా కార్యదర్శి పి.సూరిబాబు, హెచ్ఎం సీహెచ్.చిట్టిపడాల్, పీఈటీ, పీడీల అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు పి.సింహాచలం పాల్గొన్నారు.

జీనబాడులో పదో తరగతి పరీక్ష కేంద్రం ఏర్పాటు చేయాలి


డీఈవోకు వినతిపత్రాన్ని అందజేస్తున్న గ్రామ కమిటీ అధ్యక్షుడు సురేశ్, తల్లిదండ్రులు

అనంత గిరి, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని జీనబాడు, పినకోట ఆశ్రమ పాఠశాలకు సంబంధించి జీనబాడులో ఈ ఏడాది పదో తరగతి పరీక్ష కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని, జీనబాడు పంచాయతీ కమిటీ అధ్యక్షుడు సురేశ్ కోరారు. ఈ మేరకు శుక్రవారం పాడేరు స్పందన కార్యక్రమంలో జిల్లా కలెక్టర్‌ను దినేశ్‌కుమార్ కలిసి వినతి ప త్రం అందించారు. జీనబాడు ఆశ్రమ బాలికల పాఠశాల విద్యార్థినులు ప దో తరగతి పరీక్షలు రాసేందుకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, ప్రత్యేక బస్సు ద్వారా కొత్తూరు కేజీబీవీ పరీక్ష కేంద్రానికి సు మారు 85 కిలో మీటర్లు ప్రయాణించి వెళ్లాల్సివస్తోందని, పినకోట ఆశ్రమ పాఠశాల విద్యార్థులు చిలకలగెడ్డ ఆశ్రమ పాఠశాల వసతిగృహంలో ఉంటూ పరీక్ష రాయాల్సి వస్తోందని వివరించారు. కలెక్టర్ సూచనలపై డీఈవో బ్రహ్మాజీరావు వినతిపత్రమిచ్చామన్నారు.

జీసీసీ అకౌంటెంట్‌కు సన్మానం


రామచంద్రరాజుకు సన్మానం చేస్తున్న పాడేరు, చింతపల్లి డీఎంలు

జి.మాడుగుల, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): పదవీ విరమణ పొందిన స్థానిక గిరిజన సహకార సంస్థ (జీసీసీ)లో అకౌంటెంట్ మత్స్యరాస రామచంద్ర రాజును శుక్రవారం ఘనంగా సన్మానించారు. పాడేరు, చింతపల్లి డీఎంలు. కృష్ణప్రసాద్, వెంకటేశ్ ముఖ్య అతిథులుగా పాల్గొని రామచంద్రరాజు అందించిన సేవలపై కొనియాడారు. ఈ కార్యక్రమంలో జీసీసీ ఉద్యోగులు మేనేజర్ బాబురావు, ఆర్ఐ వెంకటరమణ, గొడాము ఇన్‌చార్జి సింహాచలంరాజు, పెట్రోల్ బంక్ ఇన్‌చార్జి కొండబాబు, సిబ్బంది పంతులనాయుడు, నిరీక్షణరావు, కోటిబాబు, గణపతి, కాంతరావు, సింహాచలంనాయుడు, గంగరాజు, ఈశ్వరరావు, సన్యాసయ్య, సూరిబాబు తదితరులు పాల్గొన్నారు.

అనారోగ్యంతో సీలేరు ఏఎస్ఐ మృతి


ఏఎస్ఐ బుజ్జి(ఫైల్)

సీలేరు, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి) : జీకేవీధి మండలం సీలేరు పోలీస్‌స్టేషన్‌లో ఏఎస్ఐగా పనిచేస్తున్న టి బుజ్జి (50) శుక్రవారం మధ్యాహ్నం అనారోగ్యంతో నర్సీపట్నం ఆసుపత్రిలో చికిత్స పొందుతూ ఆకస్మికంగా మృతి చెందినట్లు ఎస్ఐ ఎండీ యాసిన్ తెలిపారు. కొయ్యూరు పోలీస్‌స్టేషన్‌లో హెడ్‌కానిస్టేబుల్‌గా పనిచేస్తూ ఏఎస్ఐగా పదోన్నతిపై గతనెలలో ఇక్కడకు వచ్చారు. గతంలో ఆయన 2020 నుంచి 2023 వరకు హెచ్‌సీగా సీలేరులోనే విధులు నిర్వహించారు. అప్పటి నుంచి అందరితో కలసిమెలసి ఉండేవారు. బుజ్జికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. ఆయన మృతికి పలువురు సంతాపం తెలిపారు.

టెన్త్ పరీక్షల ఫీజు గడువు పెంపు

పాడేరురూరల్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): పదవ తరగతి విద్యార్థులకు రానున్న మార్చిలో జరిగే పరీక్షల ఫీజు గడువును ఈ నెల 30వ నుంచి డిసెంబరు 6వ తేదీ వరకు గడువు పెంచుతూ ప్రభుత్వ పరీక్షల విభాగం అమరావతి అధికారులు ఆదేశాలు జారీ చేసినట్టు డీఈవో పి.బ్రహ్మాజీరావు, ప్రభుత్వ పరీక్షల జిల్లా అసిస్టెంట్ కమిషనర్ ఆర్.శశికుమార్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎటువంటి అపరాధ రుసుం లేకుండా డిసెంబరు 6వ తేదీ లోగా ఫీజులు చెల్లించవచ్చని తెలిపారు.

ఏపీపీఆర్ఎంఈయూ చింతపల్లి యూనిట్ అధ్యక్షుడిగా ఇమ్మాన్యుయేలు



గూడెంకొత్తవీధి, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): ఏపీ పంచాయతీరాజ్ మినిస్టీరియల్ ఉద్యోగుల సంఘం (ఏపీపీఆర్ఎంఈయూ) చింతపల్లి యూనిట్ అధ్యక్షుడిగా ఎస్‌జేజే ఇమ్మానుయేలు ఏకగ్రీవంగా ఎన్నికైనట్టు ఎన్నికల అధికారి ఆర్‌వీ నాగరాజు తెలిపారు. శుక్రవారం మండల కేంద్రంలో ఉద్యోగుల సంఘం నాయకులు, ఉద్యోగుల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఉ ద్యోగులు చింతపల్లి యూనిట్ నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ఈసందర్భంగా ఎన్నికల అధికారి మాట్లాడుతూ ప్రధాన కార్యదర్శిగా జీఎన్‌వీఎస్ఎన్ పడాల్, ఉపాధ్యక్షుడిగా ఎం. పాండురంగా, సంయుక్తకార్యదర్శిగా కె. పావని, కోశాధికారిగా వి. లక్ష్మణరావు, జిల్లా కౌన్సిల్ సభ్యులు-1, 2గా టి. వెంకటమ్మ, ఎన్. శేషగిరి ఎన్నికయ్యారన్నారు. స్థానిక ఎంపీడీవో బీవీ రమణబాబు, చింతపల్లి ఎంపీడీవో సీతామహాలక్ష్మి, ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు ఎస్. సత్తిబాబు పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరానికి స్పందన


వైద్య పరీక్షలు చేస్తున్న నిపుణులు

సీలేరు, నవంబరు 28 , (ఆంధ్రజ్యోతి): జిల్లా ఎస్పీ అమిత్ బర్ధర్ ఆదేశాల మేరకు జిల్లా పోలీసులు, మైత్రి మూవీమేకర్స్ ఆధ్వర్యంలో జీకేవీధి మండలం సీలేరులో శుక్రవారం స్థానిక రామాలయం సెంటర్ వద్ద ఏర్పాటు చేసిన ఉచిత మెగా వైద్య శిబిరాన్ని ప్రముఖ సినీనటుడు సాయికుమార్, సినీ దర్శకుడు శివ నిర్వాణ ప్రారంభించారు. ఈ వైద్య శిబిరానికి రాజమహేంద్రవరానికి వైద్య నిపుణులతో పాటు సీలేరు, ధారకొండ, సప్పర్ల వైద్యాధికారులు హాజరై వైద్య సేవలను అందించారు. సీలేరు పరిసర గ్రామాలకు చెందిన 306 మందికి వైద్య పరీక్షలను నిర్వహించి ఉచితంగా మందులను పంపిణీ చేశారు. ఈ శిబిరానికి హాజరైన వారందరికి ఉచిత భోజనాలు. దూర ప్రాంతాల నుంచి వచ్చిన వారికి రవాణా సౌకర్యం కల్పించారు. జీకేవీధి సీఐ బి సుధాకర్, సీలేరు ఎస్ఐ ఎండీ యాసిన్ వైద్య శిబిరం ఏర్పాట్లనుదగ్గరుండి పర్యవేక్షించారు. ఈ శిబిరంలో కంటి వైద్య నిపుణులు , జిల్లా ఎన్‌సీడీ సీడీ ప్రోగ్రాం అధికారి డాక్టర్ పి. నారాయణ రావు, జిల్లా సికిల్‌సెల్ ఎనిమియా ప్రోగ్రాం అధికారి కొట్నీ బాబ్జి, దంత వైద్యుడుచంద్రశేఖర్, కంటి వైద్య నిపుణులు, ప్రసూతి వైద్య నిపుణురాలు జి. శృతి, చిన్న పిల్లల వైద్య నిపుణులు మణికంఠ, హోమియోపతి వైద్యురాలు సృజనారాయ్ తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలలో పిక్నిక్ సందడి


డ్యాన్స్ చేస్తున్న విద్యార్థినులు

హుకుంపేట, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఆశ్రమ పాఠశాల విద్యార్థులు ఉపాధ్యాయులతో కలిసి శుక్రవారం పిక్నిక్ ఏర్పాటు చేశారు. తమ పాఠశాల ఆవరణలో ఉదయం నుంచి సాయంత్రం వరకు ఉత్సాహంగా గడిపారు. డీజే పాటలకు డ్యాన్స్, థింసా కళాకారులతో సందడి చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి బ్రహ్మాజీ పాల్గొని ఆనందం వ్యక్తం చేశారు. విద్యార్థులు చదువుతోపాటు సాంస్కృతి కార్యక్రమాల్లో ప్రవేశం పొందాలని సూచించారు.ఈ కార్యక్రమంలో ఎంఈవోలు చెల్లయ్య, ఈశ్వరరావు ప్రధానోపాధ్యాయుడు కంబిడి సువర్ణరాజు, డబ్ల్యూలో సాగిరి ప్రేమ్ తేజ, తదితరులు పాల్గొన్నారు.

తూనికల్లో మోసాలపై కేసులు నమోదు

» లీగల్ మెట్రాలజీ అసిస్టెంట్ రామచంద్రయ్య


అరకు సంతలో తూనికయంత్రాలను పరిశీలిస్తున్న అధికారి రామచంద్రయ్య

డుంబ్రిగుడ, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): తూనిక యంత్రాల్లో తేడాలు, వస్తువిక్రయాల్లో అధిక ధరలకు విక్రయిస్తున్న ఐదుగురు వ్యాపారులపై కేసులు నమోదు చేసినట్టు అనకాపల్లి లీగల్ మెటాలజీ అసిస్టెంట్ కంట్రోలర్ రామచం ద్రయ్య తెలిపారు. అరకు సంతబయలు కేంద్రంగా శుక్రవారం జరిగిన వారపు సంతలో డిప్యూటీ కంట్రోలర్ రవికుమార్ ఆదేశాల మేరకు తనిఖీలు చేపట్టారు. ఎలక్ట్రానిక్ తూనిక యంత్రాలు సక్రమంగాలేవని, తూకాల్లో తేడాలు న్న వాటిపై క్షుణంగా తనిఖీలు చేపట్టామన్నారు. దుకాణాలతోపాటు ఎలక్ట్రానిక్ యంత్రాలతో కొనుగోలుచేసే వ్యాపారుల తేడాలపై ఐదుగురిపై కేసులు నమోదు చేశామన్నారు. ఇకపై తూకాల్లో మోసాలు జరిగితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. వ్యాపారులు తూనిక యంత్రాలను సరి చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆ శాఖ అధికారులు కొండరెడ్డి, రామారావు తదితరులు పాల్గొన్నారు.

ఏయూ విద్యార్థులు బొటానికల్ టూర్


కృష్ణాపురం ఏకో టూరిజంలో మొక్కలు నాటుతున్న విద్యార్థులు, ప్రొఫెసర్, వైద్యులు

చింతపల్లి, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రకశ్మీర్ లంబసింగికి సమీపంలో అటవీశాఖ నిర్వాహణలోనున్న కృష్ణాపురం ఎకో టూరిజం ప్రకృతి అందాలు అద్భుతంగా ఉన్నాయని ఆంధ్ర విశ్వవిద్యాలయం వృక్షశాస్త్ర విభాగం ప్రొఫెసర్ డాక్టర్ ఎస్‌బీ పడాల్ అన్నారు. శుక్రవారం బొటానికల్ టూర్‌లో భాగంగా ఆంధ్రవిశ్వవిద్యాలయం ఎమ్మెస్సీ ద్వితీయ సంవత్సరం విద్యార్థులు, రీసెర్చ్ స్కాలర్స్, వైద్యులు, ప్రొఫెసర్లు లంబసింగి పరిసర ప్రాంతాల్లో పర్యటించారు. అలాగే, అటవీశాఖ ఎకో టూరిజం ప్రాజెక్టుని సందర్శించారు. విద్యార్థులు, ప్రొఫెసర్లు ఎకో టూరిజం ప్రాజెక్టు ఆవరణలో ఎర్రచందనం, స్పాథోడియా మొక్కలను నాటారు. ఈసందర్భంగా ఏయూ వృక్షశాస్త్ర విభాగం ప్రొఫెసర్ విలేకరులతో మాట్లాడుతూ కృష్ణాపురం అటవీశాఖ ఎకో టూరిజం మంచి సందర్శక ప్రాంతమన్నారు. ఎకో టూరిజంలో పర్యాటకుల వసతి కోసం టెంట్లు, వాష్‌రూమ్స్ అందుబాటులోఉన్నాయన్నారు. మంచి వాతావరణం, చక్కటి గార్డెన్ ఉన్నదన్నారు. నాలుగు కిలోమీటర్ల ట్రెక్కింగ్ పాత్, వినోదం కోసం ఆర్చరీ, ఊయలలు ఉన్నాయన్నారు. లంబసింగి వచ్చే పర్యాటకులు కృష్ణాపురం పర్యాటక సందర్శనీయ కేంద్రమని అన్నారు. ఈ కార్యక్రమంలో వైద్యులు డాక్టర్ జె. జయప్రకాశ్ రావు, డాక్టర్ నీలిమ, డాక్టర్ సత్యవతి, పరిశోధకులు గాయత్రి, రవి కుమార్ పాల్గొన్నారు.

కాఫీ కార్మికుల సంక్షేమానికి సిద్ధం

» ఏపీఎఫ్‌డీసీ ఎండీ డాక్టర్. ఎస్ఎస్.శ్రీధర్


శ్రీధర్‌కు వినతిపత్రం అందిస్తున్న కాఫీ కార్మికులు

పాడేరురూరల్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): కాఫీ కార్మికుల సంక్షేమానికి, సంస్థ పరిరక్షణకు ఏపీఎఫ్‌డీసీ యాజమాన్యం సిద్ధంగా ఉందని సంస్థ ఎండీ డాక్టర్. ఎస్ఎస్.శ్రీధర్ స్పష్టం చేశారు. శుక్రవారం జిల్లాలోని చింతపల్లి, పాడేరు డివిజన్ పరిధిలోని మినుములూరులో పర్యటించారు. ఆయన మినుములూరు కాఫీ ఎస్టేట్‌లో కాఫీ కార్మికుల తో సమావేశమయ్యారు. ఈ సందర్భగా కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలపై కాఫీ కార్మిక సంఘం గౌరవాధ్యక్షుడు ఎల్.సుందరరావు ఆ ధ్వర్యంలో కార్మిక సంఘం నాయకులు ఎండీ శ్రీధర్‌కు వినతిపత్రం ద్వారా వివరించారు. సానుకూలంగా స్పందించిన ఆయన మాట్లాడుతూ ఇప్పటికే కూలీ రేట్లతో పాటు కాఫీ పండ్ల సేకరణ రేట్లు పెంచామన్నారు. 2024 నవంబరులో జరిగిన చర్చల ఒప్పందంలో 35 మంది హె ల్పర్లను నియమించాలని కోరగా, సంస్థ పరిరక్షణకు కింద స్థాయి సిబ్బందిని నియమించనున్నట్టు చెప్పారు. ఈ కార్యక్రమంలో ఏపీఎఫ్‌డీసీ ఆర్ఎం జ్యోతి, డీఎం.కృష్ణబాబు, రత్నదీపిక, ఏఈఎంలు, కార్మి సం ఘం నాయకులు వసంతకుమారి, వరలక్ష్మి, దేవి, పద్మ, లక్ష్మి, మణి పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన అవసరం


మాట్లాడుతున్న న్యాయమూర్తి శ్రీభరణి

చింతపల్లి, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): చట్టాలపై మహిళలు అవగాహన కలిగి ఉండాలని స్థానిక ప్రథమ శ్రేణి జుడీషియల్ మేజిస్ట్రేట్ న్యాయస్థానం న్యాయమూర్తి డి. శ్రీభరణి అన్నారు. శుక్రవారం స్థానిక ఐసీడీఎస్ కార్యాలయంలో న్యాయవిజ్ఞాన సదస్సు ఏర్పాటు చేశారు. ఈసందర్భంగా న్యాయమూర్తి మాట్లాడుతూ సమాజంలో మహిళలు లైంగిక వేధింపులు, గృహహింస, వరకట్నం సమస్యలు ఎదుర్కోవాల్సి వస్తుందన్నారు. చట్టాలపై అవగాహన ఉంటే ఇలాంటి సమస్యలపై న్యాయస్థానం ద్వారా న్యాయం పొందవచ్చునన్నారు. అలాగే బాల్యవివాహాలను అరికట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సౌజన్య, జయభారతి, న్యాయవాది రావాడ సత్యనారాయణ, ఎస్సై వి. వెంకటేశ్వరరావు, ఎక్సైజ్ ఎస్సై రాంబాబు, జీకేవీధి ఎస్సై సురేశ్, పారాలీగల్ వలంటీర్లు పనసల చిట్టిబాబు, కవడం కృష్ణ పాల్గొన్నారు.

కరాటేలో ఆశ్రమ పాఠశాల విద్యార్థినులకు పతకాలు


విద్యార్థులను అభినందిస్తున్న హెచ్ఎం

కొయ్యూరు, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర స్థాయి కరాటే పోటీలలో మండలంలో పెదమాకవరం గిరిజన సంక్షేమ బాలికల ఆశ్రమ పాఠశాల విద్యార్థినులుపది బంగారు, నాలుగు వెండి పతకాలు సాధించారు. శ్రీకాకుళంలో ఈ నెల 23న జరిగిన పోటీలలో పాఠశాల నుంచి 14 మంది విద్యార్థినులు పాల్గొన్నారు. వీరంతా ఉత్తమ ప్రతిభతో పతకాలు సాధించారు. శుక్రవారం విద్యార్థులతోపాటు శిక్షణ ఇచ్చిన కోచ్ శ్రీనును హెచ్ఎం సంధ్య అభినందించారు. పీడీ పద్మావతి, సిబ్బంది, పాల్గొన్నారు.

చట్టాల నిర్వీర్యానికే లేబర్ కోడ్‌లు: సీఐటీయూ

హుకుంపేట, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): లేబర్ కోడ్‌లను తక్షణమే రద్దు చేయాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి హైమావతి డిమాండ్ చేశారు. శుక్రవారం సీఐటీయూ మహాసభల పోస్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కేంద్రం కార్మిక హక్కులను నిర్వీర్యం చేసేందుకు లేబర్ కోడ్‌ను తీసువచ్చిందన్నారు. డిసెంబర్ 31 నుంచి జనవరి 4వరకు జరిగే సీఐటీయూ మహాసభలను విజయవంతం చేయాలని కోరారు. నాయకులు కృష్ణారావు, కె. రామారావు, లక్ష్మణరావు పాల్గొన్నారు.

తహశీల్దార్‌పై చర్యలు తీసుకోవాలి

» భూ సమస్యపై వెళ్తే దుర్భాషలాడారనే ఆరోపణలపై సర్పంచ్‌లు ఆందోళన


తహశీల్దార్ కార్యాలయ ఆవరణలో ఆందోళన చేస్తున్న సర్పంచ్‌లు

ముంచంగిపుట్టు, నవంబరు 28, (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఏనుగు రాయి పంచాయతీ పరిధిలో భూ సమస్య విషయమై రెవెన్యూ కార్యాలయానికి వెళ్లిన సర్పంచులపై అకారణంగా దుర్భాషలాడిన స్థానిక తహశీల్దార్ భాస్కరఅప్పారావుపై తగిన చర్యలు తీసుకోవాలని పలు గ్రామాల సర్పంచ్‌లు డిమాండ్ చేశారు. శుక్రవారం రెవెన్యూ కార్యాలయానికి సర్పంచ్‌లు వి.లక్ష్మణ్, ఎస్.నరసింగరావు వెళ్లారు. ఈ సమయంలో వీరిపై తహశీల్దార్ తోపాటు కొంత మంది రెవెన్యూ సిబ్బంది అనుచిత వాఖ్యలు చేసినట్టు ఆరోపించారు. ఈ నేపథ్యంలో వారు తహశీల్దార్ కార్యాలయం ఆవరణలో ఆందోళన చేశారు. ఈ సందర్భంగా బాధిత సర్పంచ్‌లు మాట్లాడుతూ ఏనుగురాయి పంచాయతీలోని భూ సమస్యకు సంబంధించి రెవెన్యూ కార్యాలయానికి వెళ్లామన్నారు. తమను బయట ఉండమని చెప్పి, భూ హక్కుదారులను తహశీల్దార్‌తో పాటు కొంత మంది రెవెన్యూ సిబ్బంది భయపెట్టేందుకు ప్రయత్నించారని వారు తెలిపారు. విషయం తెలిసి లోనికి వెళ్లి తహశీల్దార్ ప్రశ్నించగా, ప్రజా ప్రతినిధులు అని కూడా చూడకుండా తమపై అనుచిత వాఖ్యలు చేసి అవమానించారన్నారు. ఆరోపించారు. ఈ కార్యక్రమంలో మండల సర్పంచ్ ఫోరం అధ్యక్షులు వి. రమేశ్‌తో పాటు పలు గ్రామాల సర్పంచ్‌లు పార్తిమ్మ, భాగ్యవతి, నొబిన, నేతలు పాల్గొన్నారు. ఈ విషయంపై తహశీల్దార్ భాస్కరఅప్పారావును వివరణ కోరగా.. ఏనుగురాయిలో భూ సమస్యపై ఫిర్యాదు మేరకు ఇరు వర్గాలను పిలిచి, విచారణ చేపట్టామని, తాను ఎవరినీ ఏమీ అనలేదని అన్నారు.

వ్యసనాలకు దూరంగా ఉంటేనే రాణింపు

» విద్యార్థులతో సినీ నటుడు సాయికుమార్, దర్శకుడు శివనిర్వాణ


మాట్లాడుతున్న సినీ నటుడు సాయికుమార్, పక్కన శివనిర్వాణ

సీలేరు, నవంబరు 28 , (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు గంజాయి, మత్తు పదార్థాలకు, వ్యసనాలకు దూరంగా ఉండాలని సినీ నటుడు సాయికుమార్, సినీ దర్శకుడు శివ నిర్వాణ సూచించారు. జీకేవీధి మండలం సీలేరులో శుక్రవారం జిల్లా పోలీసులు , మైత్రీ మూవీ మేకర్స్ కలసి ఏర్పాటు చేసిన ఉచిత మెగా శి బిరానికి వివిధ పాఠశాల విద్యార్థులు హాజరయ్యారు. ఈ కార్యక్రమానికి వచ్చిన సాయికుమార్, శివ నిర్వాణ విద్యార్థులతో కాసేపు ముచ్చటించారు. విద్యార్థి దశ నుంచే చక్కటి ప్రణాళికలను రూపొందించుకుని కృషి చేస్తే ఉన్నత శిఖరాలను అధిరోహించవచ్చన్నారు. విద్యార్థులు గంజాయి, డ్రగ్స్ వంటి మత్తు పదార్థాలు, చెడు వ్యసనాలకు దూరంగా ఉంటేనే ఆశయాల సాధనకు వీలవుతుందని విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా విద్యార్థుల కోరిక మేరకు సినీనటుడు సాయికుమార్‌తనదైన శైలిలో చెప్పిన పలు సినిమా డైలాగ్‌లు చెప్పి ఆనందపరిచారు. విద్యార్థులు సాయికుమార్‌తో కలిసి ఫొటోలను దిగారు. సీఐ సుధాకర్, ఎస్ఐ యాసిన్, ఏపీ జెన్‌కో ఎస్ఈ చంద్రశేఖరరెడ్డి, ఏఈ ఈ సురేష్, ఎంపీటీసీ సభ్యుడు పి. సాంబమూర్తి తదితరులు పాల్గొన్నారు.

తాలూకా ఆఫీస్ సబార్డినేట్స్ యూనియన్ అధ్యక్షులుగా చాందిని


ప్రమాణ స్వీకారం చేస్తున్న ఆఫీస్ సబార్డినేట్స్ నూతన కార్యవర్గం

చింతపల్లి, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): స్థానిక తాలూకా ఆఫీస్ సబార్డినేట్స్ యూనియన్ అధ్యక్షులుగా గుల్లెలి చాందిని ఎన్నికైనట్టు ఎన్నికల అధికారి, జిల్లా అధ్యక్షుడు చిట్టిబాబు తెలిపారు. శుక్రవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మండల పరిషత్, పంచాయతీరాజ్ సబార్డినేట్స్ ఉద్యోగుల సమావేశం జరిగింది. ఉద్యోగులు నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ఈసందర్భంగా జిల్లా అధ్యక్షుడు మాట్లాడుతూ తాలూకా అధ్యక్షురాలితోపాటు ప్రధాన కార్యదర్శిగా ఎస్. హరీశ్, ఉపాధ్యక్షుడిగా ఎస్. సత్యవతి, కోశాధికారిగా ఆర్. ఉమారేణుక, కార్యవర్గ సభ్యులుగా సూర్యమణి, కె. భగత్, బి. విజయలక్ష్మి, సీహెచ్. నాగమణి ఎన్నికైనట్టు తెలిపారు.

హెచ్ఐవీ, ఎయిడ్స్‌పై ప్రజల్లో అవగాహనకు కృషి



ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అవగాహన కార్యక్రమంలో ప్రిన్సిపాల్, అధ్యాపకులు

పాడేరురూరల్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): హెచ్ఐవీ, ఎయిడ్స్‌పై యువత అవగాహన పెంచుకోవడంతోపాటు ప్రజల్లో అవగాహన కల్పించేందుకు కృషి చేయాలని స్థానిక ప్రభుత్వ డిగ్రీకళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్.టీఎస్ రసూల్ అన్నారు. ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవం సందర్భంగా శుక్రవారం కళాశాలలో రెడ్ రిబ్బన్ క్లబ్ (ఆర్ఆర్‌సీ) ఆధ్వర్యంలో ఏపీఎస్ఏసీఎస్ జిల్లా శాఖ, ఎస్‌వీడీఎస్ ఎన్‌జీవో సహకారంతో విద్యార్థులకు రంగోలీ, డిబేట్ పోటీలను నిర్వహించారు. అనంతరం పోటీలలో విజేత విద్యార్థులకు బహుమతులు అం దించారు. ఈ కార్యక్రమంలో ఆర్ఆర్‌సీ కో-ఆర్డినేటర్ జి.దామోదరరావు, జిల్లా విద్యాప్రచార అధికారి సింహాచలం, జిల్లా క్లస్టర్ ప్రోగ్రామ్ మేనేజర్ రామచంద్ర, డీఎండీవో చిరంజీవి, అధ్యాపకులు పాల్గొన్నారు.

జాబ్‌మేళాలో 49 మంది ఎంపిక


ఉద్యోగాలకు ఎంపికైన అభ్యర్థులు

పాడేరురూరల్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ నైపుణ్యాభివృద్ధి సంస్థ (ఏపీఎస్ఎస్‌డీసీ) శుక్రవారం స్థానిక జీఎంఆర్ పాలిటెక్నికల్ కళాశాలలో నిర్వహించిన జాబ్ మేళాలలో 49 మంది అ భ్యర్థులు ఉద్యోగాలకు ఎంపికయ్యారు. ఈ సందర్భంగా ఏపీఎస్ఎస్‌డీసీ డాక్టర్.పి.రోహిణి మాట్లాడుతూ, నిరుద్యోగ యువతకు ఉద్యోగ ఉపాధి అవకాశాలు కల్పించడమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమన్నారు. గిరిజన ప్రాంత విద్యార్థులు చదువుతో పాటు నైపుణ్యాలను అభివృద్ధి పరుచుకోవాలని సూచించారు. శుక్రవారం నిర్వహించిన జాబ్ మేళాలో జిల్లా పరిధిలోని వివిధ మండలాలకు చెందిన 115 మంది హాజరుకాగా, వారిలో 49 మంది అభ్యర్థులను కంపెనీల ప్రతినిధులు ఎంపిక చేశారన్నారు. వీరికి నెలకు రూ. 10 వేల నుంచి రూ. 20 వేలు వేతనం ఉంటుందన్నారు. పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ ఎం. హరిబాబు, మెడిప్లస్, అపోలో ఫార్మసీ, నవతా ట్రాన్స్ పోర్ట్, డైకిన్, టాటా ఎలక్ట్రానిక్స్ తదితర కంపెనీల ప్రతినిధులు పాల్గొన్నారు.

ఇంటి పన్ను చెల్లించనివారికి లీగల్ నోటీసులు: ఎంపీడీవో

చింతపల్లి, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): ప్రతి కుటుంబం విధిగా ఇంటి పన్ను చెల్లించాలని స్థానిక ఎంపీడీవో సీహెచ్ సీతామహాలక్ష్మి అన్నారు. శుక్రవారం స్థానిక మేజర్ పంచాయతీని ఆమె సందర్శించారు. ఇళ్ల పన్ను వసూళ్లపై కార్యదర్శి ముక్కలి వెంకటరావుని అడిగి తెలుసుకున్నారు. ఈసందర్భగా మాట్లాడుతూ ఇంటి పన్ను చెల్లించిన వెంటనే కుటుంబ యజమాని రశీదు తీసుకోవాలన్నారు. ఇంటిపన్ను పంచాయతీ అభివృద్ధికి వీలవుందన్నారు. చింతపల్లిలో ఏళ్ల తరబడి ఇళ్ల పన్ను చెల్లించని ప్రభుత్వ ఉపాధ్యాయులు, ఇతరశాఖల ఉద్యోగులు నోటీసులు ఇచ్చామన్నారు. ఇంకా వారు స్పందించకుంటే లీగల్ నోటీసులు ఇవ్వనున్నట్టు చెప్పారు. ఈకార్యక్రమంలో సర్పంచ్ దురియా పుష్పలత, పంచాయతీ క్లర్క్ అంబేడ్కర్ పాల్గొన్నారు.

గంజాయి వ్యాపారులను పట్టుకున్న ఎస్ఐకు ప్రశంస

చింతపల్లి, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): ఒడిశా నుంచి ఢిల్లీకి గంజాయి తరలిస్తున్న అంతర్‌రాష్ట్ర వ్యాపారులు, భారీ మొత్తంలో గంజాయిని పట్టుకున్న అన్నవరం ఎస్ఐ జి.వీరబాబును ఎస్పీ అమిత్‌బర్దర్ ప్రశంసించారు. శుక్రవారం ఉదయం టెలీకాన్ఫరెన్సు నిర్వహించిన ఎస్పీ గంజాయి కేసుకు సంబంధించిన వివరాలను ఎస్‌ను అడిగి తెలుసుకున్నారు. చాకచక్యంగా నిఘా పెట్టి భారీ మొత్తంలో గంజాయి, అంతర్‌రాష్ట్ర ముఠా సభ్యులను పట్టుకోవడంపై అభినందించారు. గంజాయి నిందితులను పట్టుకున్న ఎస్ఐ, సీఐ వినోద్‌బాబు, పోలీసులకు రివార్డు అందజేస్తామని ఎస్పీ తెలిపారు.

ఫారంపాండ్స్ పనులు పరిశీలన

కొయ్యూరు, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా డిసెంబరులో నిర్వహించనున్న వాటర్‌షెడ్ మహోత్సవాన్ని మండలంలో ఘనంగా నిర్వహించేందుకు చర్యలు చేపట్టాలని ఎంజీఎన్ఆర్ఈజీఎస్ ఏపీడీ లాలం సీతయ్యనాయుడు సూచించారు. శుక్రవారం వాటర్‌షెడ్ పీవో శంకర్ తో కలసి వాటర్‌షెడ్ పథకంలో మండలంలో నిర్మించిన ఫారంపాండ్స్, ఫెర్టిలేషన్ ట్యాంక్స్ తదితర పనులను ఏపీడీ పరిశీలించారు. వాటర్ షెడ్ ఉత్సవాల నిర్వహణకు గానూ ప్రోగ్రాం ఆఫీసర్ శంకర్‌కు పలు సూచనలందించారు. ఈ కార్యక్రమంలో పీవోతో పాటు టీఏ కృష్ణమోహన్ పాల్గొన్నారు.

క్షేత్ర సహాయకుల నూతన కార్యవర్గం

ముంచంగిపుట్టు, నవంబరు 28, (ఆంధ్రజ్యోతి): ఉపాధి హామీ పథకం క్షేత్ర సహాయకుల నూతన మండల కార్యకర్గం ఎన్నిక శుక్రవారం ఏకగ్రీవంగా జరిగింది. యూనియన్ మండల అధ్యక్షుడిగా వెంగడ చంద్రశేఖర్, ఉపాధ్యక్షుడిగా వంతాల సునంతరావు, గౌరవ అధ్యక్షులుగా లోకి నాయక్, రాజేంద్ర, సలహాదారులుగా ఎ.కేశవ రావు, పి. గణపతి ఎంపికయ్యారు. కార్యదర్శిగా ఎం.రాంబాబు, కోశాధికారులుగా ఎం.మణి, డి.పుష్ప, కార్యవర్గ సభ్యులుగా భరత్, నీలకంఠం, కృష్ణారావు, పొదలం, భూపన్న దొర, పవిత్ర మోహన్‌లు నియమితులయ్యారు. సమస్యల సాధనకు కృషి చేస్తామని నూతన కమిటీ పేర్కొన్నారు.


రహదారుల అభివృద్ధి వివరాలు చూపిస్తున్న ఎమ్మెల్యే రాజు

రూ.12.4 కోట్లతో తారు రోడ్ల అభివృద్ధి

» ఎమ్మెల్యే కేఎస్ఎన్ఎస్ రాజు

చోడవరం, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలో ప్రధానమైన ఐదు తారు రోడ్ల అభివృద్ధికి రూ.12 కోట్ల 40 లక్షలు విడుదలయ్యాయని ఎమ్మెల్యే కేఎస్ఎన్ఎస్ రాజు తెలిపారు. స్థానిక కార్యాలయంలో శుక్రవారం సాయంత్రం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయ మాట్లాడుతూ మండలంలోని గంధవరం నుంచి వెంకన్నపాలెం వరకు తారురోడ్డు అభివృద్ధికి రూ.కోటి 80 లక్షలు మంజూరయ్యాయని చెప్పారు. అలాగే గౌరీపట్నం జంక్షన్ నుంచి విజయరామరాజుపేట వరకూ రోడ్డు అభివృద్ధికి రూ.3.5 కోట్లు, రోలుగుంట మండలంలో వెలంకాయలపాలెం నుంచి చెట్టుపల్లి వరకు తారురోడ్డు అభివృద్ధికి రూ.12 కోట్లు, రావికమతం మండలంలోని రావికమతం జంక్షన్ నుంచి గుడ్డిప వరకూ రూ.3 కోట్లు, కొత్తూరు జంక్షన్ నుంచి గవరవరం వరకు రోడ్డు అభివృద్ధికి రూ.2.9 కోట్లు మంజూరైనట్టు ఆయన తెలిపారు. రహదారుల అభివృద్ధికి నిధులు మంజూరు చేసిన సీఎం, ఆర్అండ్బీ మంత్రికి ఎమ్మెల్యే కృతజ్ఞతలు తెలిపారు. ఈ సమావేశంలో టీడీపీ సీనియర్ నేత గూనూరు మల్లునాయుడు, పార్టీ పట్టణ అధ్యక్షుడు ఎర్రంశెట్టి చిన్న, యూత్ నాయకుడు సకురు కోటేశ్వరరావు, ఎస్సీ సెల్ నేత ఎలకా మల్లిబాబు తదితరులు పాల్గొన్నారు.

వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయం పునర్నిర్మాణం


ఆలయ పునర్నిర్మాణ పనులకు శిలాఫలకం ఆవిష్కరిస్తున్న కౌన్సిలర్ పద్మావతి

నర్సీపట్నం, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): అబీద్ సెంటర్లోని పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయ పునర్నిర్మాణ పనులకు శుక్రవారం శంకుస్థాపన నిర్వహించారు. పురపాలక సంఘం 26వ వార్డు కౌన్సిలర్ చింతకాయల పద్మావతి ప్రత్యేక పూజలు చేసి శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ శ్రీకామాక్షి ఏకాంబరేశ్వరస్వామి, శ్రీపోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామిఆలయ నిర్మాణానికి స్పీకర్ అయ్యన్నపాత్రుడు కామన్ గుడ్ ఫండ్ నుంచి రూ.60 లక్షలు మంజూరు చేయించారని తెలిపారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఆలయాల అభివృద్ధికి పెద్దపీట వేస్తున్నట్టు ఆమె చెప్పారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ ప్రతినిధులు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ ఆశయాలను ప్రజల్లోకి తీసుకెళ్లండి

» ఏఐసీసీ జాయింట్ సెక్రటరీ సుశాంత్ మిశ్రా


సమావేశంలో మాట్లాడుతున్న సుశాంత్ మిశ్రా

మాడుగుల, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పార్టీ ఆశయాలను ప్రజల్లోకి తీసుకు వెళ్లాలని ఏఐసీసీ జాయింట్ సెక్రటరీ సుశాంత్ మిశ్రా సూచించారు. మండల కేంద్రంలో సంఘటిత నిర్మాణ కార్యక్రమంలో భాగంగా శుక్రవారం నియోజకవర్గ స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాహుల్ గాంధీ జుడో యాత్ర, ఓటు చోరీ వంటి కార్యక్రమాలతో బీజేపీతో పోరాటం చేస్తున్నారన్నారు. పార్టీ బలోపేతానికి ప్రతీ కార్యకర్త కృషి చేయాలని కోరారు. అన్ని మండలాల్లో పార్టీ అధ్యక్ష, కార్యదర్శుల నియామకాలు త్వరలో జరుపుతామని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో పీసీసీ పరిశీలకులు మేడా సురేశ్, సీడీసీ కోఆర్డినేటర్ మీసాల సుబ్బన్న, మాడుగుల నియోజకవర్గ సమన్వయకర్త పడాల కొండలరావు, నాయకలు బొంతు రమణ, బోయిన భానుమూర్తి, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఎంపీపీ నూతన కార్యాలయం ప్రారంభం


ఎంపీపీ చాంబర్లో పూజలు చేస్తున్న ఎంపీపీ, అధికారులు

చీడికాడ, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): మండల పరిషత్ కార్యాలయంలో నూతనంగా నిర్మించిన భవనాన్ని ఎంపీపీ కురచా జయమ్మ, ఎంపీడీవో హేమ సుందర్రావులు కార్యాలయ గదిలో పూజలు చేసి ప్రారంభించారు. 30 ఏళ్ల క్రితం నిర్మించిన మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ, సిబ్బంది చాంబర్లు శిథిలావస్థకు చేరాయి. దీంతో మండల పరిషత్ నిధులు నుంచి రూ.15 లక్షలు మంజూరు చేసి వీటి నిర్మాణాలను పూర్తిచేశారు. ఆరు నెలల క్రితమే ఉద్యోగులు, ఎంపీడీవో చాంబర్లను ప్రారంభించగా, శుక్రవారం ఎంపీపీ నూతన కార్యాలయాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మండల పరిషత్ పర్యవేక్షకుడు పీవీకే.శ్రీనివాసరావు, అప్పలరాజుపురం సర్పంచ్ చుక్క అప్పలనాయుడు, మండల పరిషత్ కోఆప్షన్ సభ్యుడు షేక్ సూర్యనారాయణ, ఉద్యోగులు పాల్గొన్నారు.

మంచుతో వాహన చోదకుల అగచాట్లు


చెట్టుపల్లిలో దట్టంగా కురుస్తున్న మంచులో ప్రయాణిస్తున్న వాహన చోదకులు

నర్సీపట్నం అర్బన్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): మండలంలో తీవ్ర చలితో పాటు దట్టంగా కురుస్తున్న మంచుతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మండలంలోని చెట్టుపల్లి, వేములపూడి, ఓఎల్పురం, గబ్బాడ తదితర గ్రామాల్లో శుక్రవారం ఉదయం దట్టంగా మంచు కురిసింది. ఏజెన్సీ ప్రాంతాన్ని తలపించేలా మైదాన ప్రాంతంలోనూ మంచు కురుస్తున్నది. దీంతో రహదారులు కనిపించకుండా మంచుతో కప్పేశాయి. ఉదయం రహదారిపై వెళ్లే వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. వాహనాలకు లైట్లు వేసుకుని వెళ్లాల్సిన పరిస్థితి నెలకొంది. దట్టంగా కురుస్తున్న మంచుతో మినుము, పెసర తదితర అపరాలకు నష్టం వాటిల్లే ప్రమాదం ఉందని రైతులు పేర్కొన్నారు.

రింగ్ రోడ్డు నిర్మాణం.. గిరిపుత్రుల సంబరం

శరవేగంగా కొట్నాబిల్లి రోడ్డు పనులు

» ఏడు కిలోమీటర్ల వరకు పూర్తి
» త్వరలోనే అందుబాటులోకి రహ'దారి'
» ఏడు గ్రామాల ఆదివాసీలు హర్షం

రావికమతం, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి):
ఎన్నో ఏళ్లుగా నరకం చూపిస్తున్న కొట్నాబిల్లి రోడ్డుకు మహర్దశ పట్టింది. దీని నిర్మాణం శరవేగంగా జరుగుతోంది. యంత్రాలు, కూలీలతో చకచకా పనులు చేపడుతున్నారు. దీంతో ఆదివాసీలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.


కొట్నాబిల్లి నుంచి చినపాచిల కాటా వరకు పూర్తయిన రోడ్డు



కొట్నాబిల్లి రింగ్ రోడ్డు నిర్మాణ పనులు జరుగుతున్న దృశ్యం

మండలంలో చినపాచిల చెరకు కాటా నుంచి కొట్నాబిల్లి మీదుగా టి.అర్జాపురం బీఎన్ రోడ్డు వరకు సుమారు 14 కిలోమీటర్ల మేర పీఆర్ పరిధిలో రోడ్డు ఉంది. ఏడు గిరిజన గ్రామాలకు ఉపయోగకరమైన ఈ రోడ్డుపై గ్రానైట్, క్వారీ భారీ లారీలు మితిమీరిన బరువులతో రాకపోకలు సాగించడంతో పూర్తిగా ధ్వంసమైంది. పోలికలు కూడా లేకుండా రోడ్డు పాడైంది. దీంతో ఏడు గిరిజన గ్రామాల ప్రజల రాకపోకలు స్తంభించిపోయాయి. కనీసం గర్భిణులను ప్రసవం కోసం 108 వాహనాల్లో తీసుకువెళ్లడానికి కూడా అవకాశం లేకపోతోంది. దీంతో ఆయా గ్రామాల ఆదివాసీలు రోడ్డు నిర్మించాలని పలుమార్లు వినూత్న రీతుల్లో ఆందోళన కార్యక్రమాలు చేపట్టారు. అంతేకాకుండా క్వారీ లారీలను రోడ్డుపై అడ్డగించారు.

దీంతో 2024లో ఇంపాక్ట్ నిధులు రూ.6.98 కోట్లతో ఈ రోడ్డు అభివృద్ధి చేయాలని వైసీపీ ప్రభుత్వం అనుమతులు మంజూరు చేసింది. అయితే నిధులు మాత్రం విడుదల చేయలేదు. దీంతో టెండర్ దక్కించుకున్న కాంట్రాక్టర్ రోడ్డు నిర్మాణ పనులను మధ్యలోని నిలిపేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే ముఖ్య మంత్రి చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ మారుమూల గిరిజన గ్రామాల రోడ్లు త్వరతిగతిన పూర్తి చేయాలన్న ఆదేశాలతో కాంట్రాక్టర్ కదిలారు. అయితే ఏడు కిలోమీటర్ల మేర రోడ్డును మెటల్ పరిచి బిల్లు అవ్వలేదన్న షాక్తో మళ్లీ రోడ్డు నిర్మాణ పనులు గత ఏడాది నిలిపేశారు. దీంతో ఈ రోడ్డు క్వారీ లారీల ధాటికి, వర్షాలకు మరింత అధ్వానంగా మారింది. ఫలితంగా ప్రజలు రాకపోకలు స్తంభించిపోయాయి. దీంతో గిరిజనులు మరలా ఆందోళనలకు దిగడంతో ఎమ్మెల్యే కేఎస్ఎన్ఎస్ రాజు స్పందించారు. ఆయన ప్రత్యేకంగా చొరవ చూపి బిల్లు చెల్లింపునకు హామీ ఇవ్వడంతో కాంట్రాక్టర్ 14 కిలోమీటర్ల మేర ఉన్న ఈ రింగ్ రోడ్డును పూర్తి చేయడానికి ముందుకు వచ్చారు. ఇప్పటికే కొట్నాబిల్లి నుంచి చినపాచిల కాటా వరకు రోడ్డు నిర్మాణ పనులు పూర్తి చేశారు. దీంతో పి.కొట్నాబిల్లి, కె.కొట్నాబిల్లి, గదబపాలెం, రామన్నదొరపాలెం ఆదివాసీలతో పాటు యర్రబంద, చినపాచిల గ్రామాల ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. మిగిలిన మరో ఏడు కిలోమీటర్ల మేర పి.కొట్నాబిల్లి నుంచి టి.అర్జాపురం బీఎన్ రోడ్డు కూడా త్వరగతిన పూర్తి చేస్తామని పీఆర్ ప్రాజెక్ట్ డీఈ శ్రీహరి తెలిపారు.

ఆన్లైన్ మోసాలపై ప్రజలను అప్రమత్తం చేయండి

» పోలీసులకు జిల్లా ఎస్పీ తుహిన్సిన్హా ఆదేశం
» చోడవరం పోలీసు స్టేషన్లో తనిఖీలు


పోలీసు స్టేషన్లో రికార్డులు పరిశీలిస్తున్న ఎస్పీ

చోడవరం, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): పెచ్చుమీరుతున్న ఆన్లైన్ మోసాల పట్ల ప్రజలను అప్రమత్తం చేయాలని జిల్లా ఎస్పీ తుహిన్సిన్హా ఆదేశించారు. శుక్రవారం సాయంత్రం స్థానిక పోలీసు స్టేషన్ను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పోలీసు అధికారులు, సిబ్బందితో ఎస్పీ మాట్లాడారు. సోషల్ మీడియా వేదికగా సాగుతున్న మోసాలపై ప్రచార కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. అలాగే పెండింగ్ కేసుల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలన్నారు. ప్రతీ కేసును ఎఫ్ఐఆర్ నుంచి కోర్టు తీర్పు వరకూ వివరాలను పూర్తిగా ఆన్లైన్లో అప్డేట్ చేయాలని స్పష్టం చేశారు. నేరాల నియంత్రణకు వీలుగా సీసీ టీవీలు ఎక్కువగా ఏర్పాటు చేసుకునేలా స్థానికులను ప్రోత్సహించాలని ఎస్పీ ఆదేశించారు. కీలక కూడళ్లల్లో సీసీ కెమెరాల ఏర్పాటుకు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. అలాగే గ్రామాల్లో అసాంఘిక కార్యకలాపాలు నిరోధించాలని, ట్రాఫిక్ నియంత్రణపై ప్రత్యేకంగా దృష్టిసారించాలని సూచించారు. నదీ తీరాలు, జలాశయాలు పిక్నిక్ స్పాట్ల వద్ద సెల్ఫీల పేరుతో ప్రమాదాల పాలవుతున్న యువతను హెచ్చరించాలని చెప్పారు. మహిళా చట్టాలు, పోక్సో కేసులపై విద్యార్థులకు అవగాహన కల్పించాలని సూచించారు. డిసెంబరు 13న జరగనున్న జాతీయ లోక్ అదాలత్లో వీలైనన్ని ఎక్కువ కేసులు పరిష్కారమయ్యేలా చూడాలని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా స్టేషన్లోని రికార్డులు తనిఖీ చేసిన సిబ్బంది పనితీరును సమీక్షించారు. కార్యక్రమంలో ఇన్చార్జి డీఎస్పీ ఇ.శ్రీనివాసలు, సీఐ బి.అప్పలరాజు, ఎస్ఐలు జోగారావు, నాగకార్తీక్, ట్రైనీ ఎస్ఐ కమల భార్గవ పాల్గొన్నారు.

ప్రజా దర్బార్లో 55 దరఖాస్తులు: ఎమ్మెల్యే బండారు



ప్రజా దర్బార్లో వినతులు పరిశీలిస్తున్న ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి

దేవరాపల్లి, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): ప్రజా దర్బార్లో 55 దరఖాస్తులు వచ్చాయని, వీటిని పీజీఆర్ఎస్లో అప్లోడ్ చేస్తామని ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి తెలిపారు. మండల కేంద్రంలో శుక్రవారం నిర్వహించిన ప్రజా దర్బార్లో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పథకాల అమలు, పౌర సేవలను ప్రజలకు చేరువ చేయడంలో టీడీపీ కార్యకర్తలకు కీలక బాధ్యతలు అప్పగించినట్టు చెప్పారు. తద్వారా పాలనలో వారికి భాగస్వామ్యం కల్పిస్తూ నూతన విధానానికి శ్రీకారం చుట్టామన్నారు. ఎన్నికలకే పరిమితం కాకుండా సాధారణ పరిపాలనలోనూ కార్యకర్తను ఒక అధినేతగా ప్రోత్సహించే లక్ష్యంగా ప్రజా దర్బార్ నిర్వహిస్తున్నట్టు ఆయన చెప్పారు. గత ప్రభుత్వం వలంటీర్ వ్యవస్థను అడ్డంగా పెట్టుకుని ఇష్టానుసారంగా వ్యవహరించడం వల్ల ప్రజలు తీవ్రమైన ఇబ్బందులు పడ్డారన్నారు. పార్టీ కోసం అహర్నిశలు కష్టపడే కార్యకర్తలు సైతం తమ సమస్యలను ప్రజా పక్షాన సమస్యలను నేరుగా ప్రజా ప్రతినిధులు దృష్టికి తీసుకు వెళ్లలేని దయనీయ స్థితి గతంలో ఉండేదని, ఇప్పుడు ఆ స్థితి రాకుండా ఉండేందుకు ప్రతీ సోమవారం పీజీఆర్ఎస్ నిర్వహిస్తున్నామని, శనివారం రెవెన్యూ పరమైన సమస్యలకు పరిష్కార మార్గం చూపుతున్నామని ఆయన తెలిపారు. గత ప్రభుత్వం చేసిన పొరపాట్లు సరిదిద్దలేక తల నొప్పిగా తయారైందన్నారు. మాడుగుల నియోజక వర్గంలో మాడుగుల మండలాన్ని నర్సీపట్నం డివిజన్లోను, మిగతా మూడు మండలాలను అనకాపల్లి రెవెన్యూ డివిజన్లో చేర్చుతూ ప్రభుత్వం తాజాగా ఉత్తర్వులు జారీ చేసిందన్నారు. దీనిపై ఎవరికైనా అభ్యంతరాలు ఉంటే ప్రభుత్వానికి చెప్పవచ్చని ఆయన తెలిపారు. మాజీ ఎంపీపీ కిలపర్తి భాస్కరరావు, మండల అధ్యక్షుడు వెంకటరమణ, జలాశయ చైర్మన్ పాత్రునాయుడు పాల్గొన్నారు.

రక్షిత నీరు సరఫరా చేయాలని ఆందోళన


బాబూ జగ్జీవన్రామ్ విగ్రహం ఎదుట నినాదాలు చేస్తున్న బాధితులు

రావికమతం, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొత్తకోట పంచాయతీలో వాటర్ ట్యాంకర్ ద్వారా రక్షిత నీటిని సరఫరా చేయాలని అరుంధతి, అంబేడ్కర్ కాలనీ మహిళలు డిమాండ్ చేశారు. ఈ మేరకు బాబూ జగ్జీవన్రామ్ విగ్రహం ఎదుట శుక్రవారం ఆందోళనకు దిగారు. పెద్ద ట్యాంకు మరమ్మతుల నేపథ్యంలో 20 రోజులుగా ఈ కాలనీలకు తాగునీరు సక్రమంగా అందడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. రెండు రోజులకు ఒక సారి నామమాత్రంగా నీటిని ఇస్తూ ఇచ్చి సరిపెట్టేస్తున్నారని వాపోయరు. దీనిపై ఆందోళనకు దిగితే ఒక్కరోజు మాత్రమే ట్యాంకర్ ద్వారా తాగునీరు సరఫరా చేసి, ఆపై అధికారులు తూతూమంత్రంగా వేరే ట్యాంకు ద్వారా ఈ కాలనీలకు తాగునీరు సరఫరా చేస్తున్నారని అసహనం వ్యక్తం చేశారు. అది కూడా పూర్తిగా బురద నీరే వస్తున్నదని మహిళలు వాపోయారు. ఈ బురద నీరు తాగితే జబ్బుల బారిన పడే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా సంబంధిత ఉన్నతాధికారులు, ప్రజా ప్రతినిధులు స్పందించి పెద్ద ట్యాంకు మరమ్మతులు పూర్తయ్యేవరకూ ఈ రెండు కాలనీలకు స్వచ్ఛమైన తాగునీటిని ట్యాంకర్ల ద్వారా సరఫరా చేయాలని వారు డిమాండ్ చేశారు. లేకుంటే ఖాళీ బిందెలతో మండల పరిషత్ కార్యాలయం వద్ద ఆందోళన చేపడతామని వారు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యులు కె.గోవిందరావు, సిహెచ్.రాజు, ఎత్తుల రాజు, మహిళలు పాల్గొన్నారు.

విద్యార్థుల అభ్యసన స్థాయిపై తనిఖీలు

చోడవరం, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలల్లో ఒకటి నుంచి ఐదు తరగతులు చదువుతున్న విద్యార్థుల అభ్యసన స్థాయిపై విదాయ శాఖాధికారులు తనిఖీలు చేశారు. ఎంఈవో కె.సింహాచలంతో పాటు సీఆర్పీలు ఈ తనిఖీలు నిర్వహించారు. మండలంలోని పాఠశాలల వారీగా ప్రాథమిక విద్యార్థుల స్థాయిలను వారు అధ్యయనం చేశారు. దీనికి పంబంధించిన పట్టికలను పరిశీలన చేశారు. ఈ కార్యక్రమంలో సీఆర్పీలు కేవీఎం నాయుడు, తదితరులు పాల్గొన్నారు.


పాఠశాలల్లో విద్యార్థుల అభ్యసన స్థాయిని పరిశీలిస్తున్న ఎంఈవో, సిబ్బంది

పది మద్యం సీసాలు స్వాధీనం

చీడికాడ, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): పది మద్యం సీసాలతో ఓ వ్యక్తిపై పట్టుకున్నట్టు ఎస్ఐ బి.సతీశ్ తెలిపారు. శుక్రవారం రాత్రి విలేకరులతో ఆయన మాట్లాడుతూ పాడేరు మండలం ఐనాడ పంచాయతీకి చెందిన పి.చిట్టిబాబు, చీడికాడ మండలం మంచాల గదబూరు సమీపంలో శుక్రవారం సాయంత్రం పది మద్యం సీసాలు పట్టుకొని తిరుగుతుండగా, ముందస్తు సమాచారం మేరకు వెళ్లి పట్టుకున్నామన్నారు. అతనితో పాటు మరొక వ్యక్తి బహిరంగంగా మద్యం తాగుతున్నారన్నారు. ఇద్దరిపైనా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ తెలిపారు.

ప్రణాళికాబద్ధంగా చదివితే ఉత్తమ ఫలితాలు

పరవాడ, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థులు ప్రణాళికాబద్ధంగా చదివితే ఉత్తమ ఫలితాలు సాధ్యమని రాంకీ ఫౌండేషన్ డిప్యూటీ హెడ్ కె.శ్రీకాంత్ అన్నారు. మండలంలోని వాడచీపురుపల్లి హైస్కూల్లో తొమ్మిది, పది తరగతుల విద్యార్థులకు శుక్రవారం రాంకీ ఫౌండేషన్, మ్యాజిక్బస్సు ఇండియా సంస్థ సంయుక్త ఆధ్వర్యంలోని కెరీర్ గైడెన్స్పై ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. విద్యార్థి దశ నుంచే ప్రశ్నించే మంచి లక్ష్యాలు ఏర్పరుచుకోవాలన్నారు. విద్యపై దృష్టి సారిస్తేనే భవిష్యత్తులో ఉన్నత శిఖరాలను అధిరోహించవచ్చునన్నారు. విద్యార్థులకు పదో తరగతి చాలా కీలకమని, ప్రణాళికాబద్ధంగా చదివి మంచి ఫలితాలు సాధించాలని ఆకాంక్షించారు.

వరి కోతలు నిలిపివేయండి

మాకవరపాలెం, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): మండలంలో ప్రస్తుతం వరి కోతలు నిలిపివేయాలని వ్యవసాయాధికారి డి.అప్పారావు తెలిపారు. ఈ నెల 30వ తేదీన తుఫాన్ రానున్న సందర్భంగా వరి కోతలు విరమించుకోవాలన్నారు. ఇప్పటికే కోతకు వరి సాగు సిద్ధమైనా కోయవద్దని సూచించారు. మాకవరపాలెం, కొండల అగ్రహారం, తామరం, గిడుతూరు, బయ్యవరం తదితర గ్రామాల్లో వరి కోతలు నిలిపివేయాలని రైతులకు ఏవో సూచించారు. అలాగే పొలాల్లో నీరు ఎక్కువగా ఉంటే తొలగించాలన్నారు.

పీఏసీఎస్ చైర్మన్ మాణిక్యం కుటుంబానికి పద్మావతి పరామర్శ

నాతవరం, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): నాతవరం పీఏసీఎస్ చైర్మన్ అపిరెడ్డి మాణిక్యం కుటుంబాన్ని స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు సతీమణి, నర్సీపట్నం మునిసిపల్ కౌన్సిలర్ పద్మావతి శుక్రవారం పరామర్శించారు. మాణిక్యం మాతృమూర్తి చిట్టమ్మ మృతి చెందిన విషయం తెలిసిందే. ఈ మేరకు స్థానిక టీడీపీ నాయకులు శెట్టి లోవ, చింతకాయల శ్రీనువాసు శెట్టి గోపీ తదితరులతో కలసి పద్మావతి వెళ్లి మాణిక్యం కుటుంబాన్ని పరామర్శించి ధైర్యం చెప్పారు.

ఏపీఈఎంజేఏ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా కిశోర్

నర్సీపట్నం, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): ఏపీ ఎలక్ట్రానిక్ మీడియా జర్నలిస్ట్ అసోసియేషన్ (ఏపీఈఎంజేఏ) రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా నర్సీపట్నం ప్రాంతానికి చెందిన చింతల కిశోర్ ఎన్నికయ్యారు. విజయవాడలో శుక్రవారం జరిగిన విస్తృత స్థాయి సమావేశంలో ఏపీఈ ఎంజేఏ నూతన కార్యవర్గాన్ని ఎన్నుకోవడం జరిగింది. గత కార్యవర్గంలో రాష్ట్ర కార్యదర్శిగా పని చేసిన కిశోర్ను ఇప్పుడు రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా ఎన్నుకున్నట్టు ఏపీయూడబ్ల్యూజే రాష్ట్ర కార్యదర్శి సీహెచ్.బీఎల్.స్వామి ఒక ప్రకటనలో తెలిపారు. అలాగే అనకాపల్లికి చెందిన వెంకట అప్పారావును, అల్లూరి జిల్లా పాడేరుకు చెందిన రాజేశ్ను రాష్ట్ర కార్యవర్గ సభ్యులుగా ఎన్నుకున్నారని ఆయన తెలిపారు. వీరి ఎన్నికను ఏపీయూడబ్ల్యూజే రాష్ట్ర అధ్యక్షుడు ఐవీ సుబ్బారావు అధికారికంగా ప్రకటించారన్నారు.

10న తాండవ నీరు నిలిపివేత

నాతవరం. నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): తాండవ రిజర్వాయర్ నుంచి ఖరీఫ్ సీజన్కు అందిస్తున్న సాగు నీటి విడుదలను డిసెంబరు 10వ తేదీన నిలిపివేస్తున్నట్టు తాండవ డీఈఈ అనురాధ తెలిపారు. ఈ ఏడాది 2025 ఆగస్టు 10న తాండవ నీటిని కుడి, ఎడమ కాలువల ద్వారా 52 వేల ఎకరాలకు విడుదల చేశామని చెప్పారు. వచ్చే డిసెంబరు 10వ తేదీ నాటికి తాండవ నీరు విడుదల చేసి 120 రోజులు అవుతుందని, దీంతో ఖరీఫ్ సీజన్కు తాము అందివలసిన 120 రోజులు పూర్తయ్యాయని ఆమె తెలిపారు. తాండవ రిజర్వాయర్ గరిష్ఠ నీటిమట్టం 380 అడుగులు కాగా, ప్రస్తుతం 376.2 అడుగుల నీటి నిల్వలు ఉన్నాయని చెప్పారు. తాండవ ఆయకట్టు పరిధిలో డిసెంబరు 10వ తేది తర్వాత ఇంకా రైతులకు సాగునీరు అవసరమైతే తమ దృష్టికి తీసుకురావాలని డీఈఈ సూచించారు.

రామాలయ నిర్మాణానికి శంకుస్థాపన

బుచ్చెయ్యపేట, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): మండలంలో గున్నెంపూడి రామాలయ నిర్మాణం కోసం శుక్రవారం శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే కేఎస్ఎన్ఎస్ రాజు పాల్గొన్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ టీడీపీ నుంచి ఈ గ్రామానికి రూ.10 లక్షలు మంజూరయ్యాయని చెప్పారు. అలాగే ప్రతీ గ్రామానికి టీడీపీ నుంచి నిధులు మంజూరు చేయిస్తానని ఆయన తెలిపారు. గ్రామాలలో వసతులు కల్పనే తన ధ్యేయమన్నారు. ఆధ్యాత్మికంగా గ్రామాలు అభివృద్ధి చెందాలని ఆయన ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి గుడివాడ అమర్నాథ్ పాల్గొని రామాలయ నిర్మాణం కోసం సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు. విశాఖ డెయిరీ డైరెక్టర్ గేదెల సత్యనారాయణ, జడ్పీటీసీ సభ్యుడు దొండా రాంబాబు, ఎంపీపీ డి.నాగేశ్వరిదేవి, టీడీపీ మండల అధ్యక్షుడు ఎంవీవీ.సత్యనారాయణ, నాయకులు తాతీలు, గోకివాడ కోటేశ్వరరావు; వియ్యపు అప్పారావు, ముచ్చకర్ల హరణి, అప్పారావు, సుశీల, కాసులమ్మ పాల్గొన్నారు.

విద్యార్థిని లిఖితకు అభినందనలు

మాడుగుల రూరల్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కింతలి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పదో తరగతి విద్యార్థిని కొటారి లిఖిత ఇటీవల ఢిల్లీ స్థాయిలో ప్రతిభ కనబరిచిన సందర్భంగా శుక్రవారం ఎంపీపీ తాళ్లపురెడ్డి వెంకట రాజారామ్ అభినందించారు. ఆమెకు శాలువా వేసి సత్కరించారు. ఉన్నత స్థాయికి చేరాలని ఆకాంక్షించారు. విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను సాధించాలనే పట్టుదలతో చదవాలని సూచించారు. అనంతరం పాఠశాలలో మధ్యాహ్న భోజన పథకాన్ని పరిశీలించారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం ప్రభాకర్, సీఆర్ఎంటీ సురేశ్ పాల్గొన్నారు.

ఉపాధ్యాయులకు క్రీడా పోటీలు

రోలుగుంట, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయులకు మండల స్థాయి క్రీడా పోటీలను శుక్రవారం నిర్వహించారు. ఇందులో భాగంగా తొలి రోజు పురుష ఉపాధ్యాయులకు క్రికెట్ పోటీలను నిర్వహించారు. ఎంఈవోలు జాన్ ప్రసాద్, జగ్గారావు పోటీలను ప్రారంభించారు. మండలంలోని వివిధ పాఠశాలల నుంచి సెకండరీ గ్రేడ్ టీచర్లు, స్కూల్ అసిస్టెంట్లు, వ్యాయామ ఉపాధ్యాయులు పోటీల్లో పాల్గొన్నారు. కెప్టెన్ బండారు సూర్యనారాయణ టీమ్ విజేతగా నిలిచింది. వీరిలో బెస్ట్ ప్లేయింగ్ కెప్టెన్గా బండారు సూర్యనారాయణ, బెస్ట్ బౌలర్గా భాస్కర్, బెస్ట్ బ్యాట్స్మన్గా గెడ్డం ప్రకాశ్ నిలిచారు. విజేతలుగా నిలిచిన జట్టుకు బహుమతులను అందించారు.

ప్రహారీ గోడ నిర్మాణానికి భూమి పూజ

దేవరాపల్లి, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నాగయ్యపేట శివారు సీతంపేటలో శ్మశాన వాటిక ప్రహారీ గోడ నిర్మాణానికి ఎంపీటీసీ సభ్యులు వంటాకు పైడితల్లమ్మ శుక్రవారం భూమి పూజ చేశారు. మండల పరిషత్, గ్రామ పంచాయతీ, గ్రామస్థుల సహకారంతో సమకూర్చిన ఈ నిధులతో ప్రహారీ గోడ నిర్మాణంతో పాటు శ్మశాన వాటికలో సదుపాయాలు కల్పిస్తున్నారు. స్థానిక నాయకులు వంటాకు శ్రీను, కర్రి నాయుడు మాట్లాడుతూ పార్టీలకు అతీతంగా ఈ శ్మశాన వాటిక అభివృద్ధికి అందరూ కృషి చేయాలని కోరారు.

పోలీసు సంక్షేమ దినోత్సవం



సిబ్బంది సమస్యలను వింటున్న ఎస్పీ తుహిన్‌సిన్హా

అనకాపల్లి రూరల్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): జిల్లా పోలీసు కార్యాలయంలో పోలీసు వెల్ఫేర్ దినోత్సవాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పలువురు పోలీసు ఉద్యోగులు పాల్గొని తమ సమస్యలను ఎస్పీకి మొర పెట్టుకున్నారు. ఎస్పీ తుహిన్‌సిన్హా ఉద్యోగుల సమస్యలను విని, వాటి పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఆరోగ్య, కుటుంబ సంక్షేమ, విధుల సమస్యల పై ఉద్యోగులు ఎస్పీకి తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా పోలీసు కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

జర్నలిస్టుల అక్రిడేషన్ కార్డుల గడువు పొడిగింపు

అనకాపల్లి, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): జర్నలిస్టుల అక్రిడేషన్ కార్డుల కాల పరిమితిని ప్రభుత్వం మరో రెండు నెలల పాటు పొడిగించింది. డిసెంబరు 1వ తేదీ నుంచి 2026 జనవరి 31వ తేదీ వరకు గడువు పొడిగిస్తూ సమాచార పౌర సంబంధాల శాఖ సంచాలకులు కేఎస్ విశ్వనాథ్ ఆదేశాలు జారీ చేశారు. నవంబరు నెల వరకు అక్రిడేషన్‌లు కలిగివున్న జర్నలిస్టులకు గడువు వర్తిస్తుందని ఆయన పేర్కొన్నారు.

బీఎన్ రోడ్డులో కూరుకుపోయిన వ్యాన్

- గంటల తరబడి నిలిచిపోయిన వాహనాలు
- వాహన చోదకులు, ప్రయాణికుల అవస్థలు



బీఎన్ రోడ్డులో దొండపూడి వద్ద గుంతలో కూరుకుపోయిన వ్యాన్‌ను నెడుతున్న ప్రజలు



చాంతాడులా నిలిచిపోయిన వాహనాలు

రావికమతం, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బీఎన్ రోడ్డులో దొండపూడి వద్ద గుంతలో ఓ వ్యాన్ కూరుకుపోయింది. దీంతో గంటల తరబడి వాహనాలు నిలిచిపోయాయి. వాహన చోదకులు, ప్రయాణికులు తీవ్రమైన ఇబ్బందులు పడ్డారు. వడ్డాది నుంచి బంగాళదుంపల లోడుతో శుక్రవారం వ్యాన్ వెళ్తున్నది. రావికమతం మండలం దొండపూడి వద్ద బీబీఎన్ రోడ్డులో ఉన్న గొయ్యిలో వ్యాన్ కూరుకుపోయింది. వ్యాన్‌ను పైకి నెట్టేందుకు గ్రామస్థులు ఎంత ప్రయత్నించినా ఫలితం లేకపోయింది. దీంతో గంటల తరబడి రోడ్డుకు రెండు వైపులా వాహనాలు నిలిచిపోయాయి. ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం ఏర్పడడంతోవాహన చోదకులు, ప్రయాణికులు నానా అవస్థలు పడ్డారు. చివరికి టిప్పర్ లారీ సాయంతో రోప్ కట్టి రోడ్డు వ్యాన్‌ను పైకి లాగడంతో వాహన చోదకులు, ప్రయాణికులు ఊపిరి తీసుకున్నారు. కాగా, ఈ రోడ్డు దుస్థితిని పాలకులు, ఆర్‌అండ్‌బీ అధికారులు పట్టించుకోకపోవడంపై ప్రయాణికులు దుమ్మెత్తిపోస్తున్నారు.

రైలులో ప్రయాణిస్తుండగా పురిటినొప్పులు

విశాఖ స్టేషన్‌లో దించి అంబులెన్స్‌లోకి తరలించి

అత్యవసర వైద్యం అందించిన రైల్వే డాక్టర్, సిబ్బంది

సాధారణ ప్రసవం...ఆడ శిశువు జననం



తల్లీ, బిడ్డ

విశాఖపట్నం, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): రైలులో పురిటి నొప్పులతో బాధపడిన ఓ మహిళ విశాఖ స్టేషన్‌లో సిబ్బంది సురక్షితంగా దించి అత్యవసర వైద్య సేవలందించడంతో ఆడ శిశువును ప్రసవించింది. గురువారం ఎర్నాకులం-హటియా ఎక్స్‌ప్రెస్ (22838)లో ప్రయాణిస్తున్న గర్భిణికి ప్రసవ నొప్పులు రావడంతోపాటు రక్తస్రావం అవుతున్నట్టు సమాచారం అందుకున్న విశాఖ రైల్వే సిబ్బంది, డాక్టర్ భాషిణి ప్రియాంక అప్రమత్తమయ్యారు. రాత్రి 11.40 గంటల సమయంలో రైలు విశాఖకు చేరుకోగానే గేట్-1 వద్ద సిద్ధంగా ఉంచిన అంబులెన్స్‌లోకి తరలించారు. అప్పటికే నొప్పులు, రక్తస్రావం ఎక్కువ కావడంతో డాక్టర్ భాషిణి ప్రియాంక, వైద్య సిబ్బంది అంబులెన్స్‌లోనే సాధారణ ప్రసవాన్ని విజయవంతంగా చేయించగలిగారు. తల్లి, బిడ్డ ఆరోగ్య పరిస్థితి స్థిరంగా ఉన్న నేపథ్యంలో వారిని తదుపరి చికిత్స నిమిత్తం కేజీహెచ్‌కు తరలించారు. అప్రమత్తంగా వ్యవహరించి తల్లీబిడ్డలను కాపాడేలా సేవలందించిన డాక్టర్ భాషిణి ప్రియాంక బృందాన్ని వాల్తేరు డీఆర్ఎం లలిత్ బొహ్రా అభినందించారు.

హాట్ కేకుల్లా అమ్ముడైన వన్డే టికెట్లు

విశాఖపట్నం-స్పోర్ట్స్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): భారత్, దక్షిణాఫ్రికా జట్ల మధ్య డిసెంబరు 6న ఏసీఏ-వీడీసీఏ స్టేడియంలో జరగనున్న అంతర్జాతీయ వన్డే మ్యాచ్‌కు సంబంధించిన టికెట్లు హాట్ కేకుల్లా అమ్ముడైపోయాయి. శుక్రవారం ఉదయం ఆన్‌లైన్‌లో డిస్ట్రిక్ బై జొమాటో యాప్ ద్వారా అమ్మకాలు చేపట్టారు. తొలి గంటల వ్యవధిలోనే రూ.1,200, 2,000, 2,500, 3,000, 3,500, 4,000, 5,000 శ్రేణి ధరల టికెట్లు అయిపోయాయి. మరికొద్దిసేపటికే రూ.10,000 టికెట్లు అమ్ముడైపోయాయి. సాయంత్రం వరకు కార్పొరేట్ బాక్స్ రూ.15,000, షూట్ రూ.18,000 ధర టికెట్లు అందుబాటులో ఉండగా, రాత్రి 9.00 గంటల సమయంలో రూ.18,000 టికెట్లు కూడా కనిపించలేదు. మిగిలిన కార్పొరేట్ బాక్స్ రూ.15 వేల టికెట్లు మాత్రం రాత్రి 10.00 గంటలకు అందుబాటులో ఉన్నట్టు వెబ్‌సైట్‌లో చూపించింది. స్టేడియం సామర్థ్యం మేరకు 22 వేల టికెట్లు అమ్మకానికి పెడుతున్నట్టు ఏసీఏ ప్రతినిధులు ప్రకటించారు. ఏ ధరకు ఎన్ని టికెట్లు (డినామినేషన్) అనే వివరాలను తెలపలేదు. రూ.1,200 టికెట్లు నిమిషాల వ్యవధిలో అయిపోవడంతో క్రీడాభిమానులు నిరుత్సాహానికి గురయ్యారు.

కార్యాలయానికి దారేది..?

తహశీల్దార్ కార్యాలయ ద్వారానికి ఎదురుగా కారు పార్కింగ్

- షెడ్డు ఉన్నా.. ఎప్పుడూ అక్కడే పెడుతున్న సారు!
- లోపలకు వెళ్లడానికి ప్రజల ఆపసోపాలు



కార్యాలయానికి ఎదురుగా పార్కు చేసిన కారు పక్క నుంచి ఇబ్బంది పడుతూ వెళ్తున్న అర్జీదారు

రాజు తలచుకుంటే ఏమైనా చేయగలరు! ఆ పని వల్ల కష్టనష్టాల గురించీ ఆలోచించరు. దాన్ని ప్రశ్నించే సాహసం చేసేవారూ ఉండరు. అచ్చం ఇలాగే.. చోడవరం మండల రెవెన్యూ కార్యాలయానికి రాజులాంటి తహశీల్దార్ చేసే పని వల్ల ఇబ్బందులు ఎదురవుతున్నా, పడుతూనే జనం వచ్చిపోతున్నారు. ఇంతకీ సారు చేసిన పనేమిటంటే..? అసలే అతి చిన్న కార్యాలయ ద్వారానికి ఎదురుగా కారు పార్కింగ్ చేయడమే! పోనీ కారు పెట్టడానికి ఎక్కడా స్థలం లేదనుకుంటే పొరబడినట్టే! సరికదా.. ఇది ఒక్క రోజు తతంగం కాదు!



తహశీల్దార్ కారు కోసం ఉన్న షెడ్డు

చోడవరం, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): మండల రెవెన్యూ కార్యాలయం లోపలకు వెళ్లడానికి అతి చిన్న ప్రవేశం ఉంది. ఒకరి తరువాతగా ఒకరు లోపలకు వెళ్లాల్సిన పరిస్థితి. ఈ క్రమంలో కార్యాలయం ముందు కనీసం నిలబడే ప్రదేశం కూడా లేకుండా తహశీల్దార్ కారు పార్కింగ్ చేస్తున్నారు. ఇది పెద్ద సారు చేస్తున్న పని కావడంతో కార్యాలయానికి వచ్చిన వారు కిమ్మనకుండా ఆ కారు పక్క నుంచే కార్యాలయం లోపలకు ఇబ్బందులు పడుతూ వెళ్తున్నారు. గత కొంత కాలంగా ఇదే తంతు కొనసాగుతున్నది. పోనీ తహశీల్దార్ కారుకు పెట్టుకోవడానికి స్థలం లేదా అంటే..? కార్యాలయం ఆవరణ అంతా ఖాళీగానే ఉంటుంది. బయట నుంచి ఎంతోమంది వచ్చి ఈ కార్యాలయం ఆవరణలోనే తమ కార్లు పార్కింగ్ చేస్తుంటారు. దీనికి తోడు తహశీల్దార్ కారు ఉంచడానికి షెడ్డు కూడా ఉంది. దాన్ని కొద్దిగా బాగు చేసి, అందులో కారు పార్కింగ్ చేసుకొనే వెసులుబాటు ఉంది. అయినప్పటికీ ఇలా కార్యాలయానికి అడ్డంగా తహశీల్దార్ తన కారు ఉంచడం విమర్శలకు తావిస్తున్నది. కార్యాలయానికి వచ్చే వారికి దారి లేకుండా, కనీసం కార్యాలయం ముందు నిల్చొనే అవకాశం కూడా లేకుండా ఇలా కార్యాలయం ముందుగానే కారు నిలిపి ఉంచడం చూసి అంతా ముక్కున వేలేసుకుంటున్నారు.

అట్టహాసంగా రాష్ట్ర స్థాయి ఖోఖో పోటీలు



పోటీలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్సీ శ్రీనివాసులనాయుడు, డీఈవో

లంకెలపాలెం, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): పరవాడ మండలంలోని లంకెలపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో రాష్ట్ర స్థాయి ఖోఖో పోటీలు శుక్రవారం అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ (ఎస్‌జీఎఫ్) ఆధ్వర్యంలో ఈ పోటీలను ప్రారంభించారు. విద్యార్థులు ఉల్లాసంగా.. ఉత్సాహంగా క్రీడా మహోత్సవంలో పాల్గొని సందడి చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లాల విచ్చేసిన క్రీడాకారులకు విద్యార్థులు ఘన స్వాగతం పలికారు. తొలుత ఉపాధ్యాయ ఎమ్మెల్సీ గాదె శ్రీనివాసులనాయుడు, డీఈవో గిడ్డి అప్పారావునాయుడు, గవర కార్పొరేషన్ చైర్మన్ మళ్ల సురేంద్ర, కార్పొరేటర్ రౌతు శ్రీనివాస్ విద్యార్థులతో కలిసి మార్చిఫాస్ట్ నిర్వహించారు. వంద అడుగుల జాతీయ పతాకాన్ని స్థానిక జంక్షన్ మీదుగా పాఠశాల వరకు ఊరేగించారు.

జాతీయ స్థాయి క్రీడాకారులుగా ఎదగాలి

జాతీయ స్థాయి క్రీడాకారులుగా ఎదగాలని ఉపాధ్యాయ ఎమ్మెల్సీ శ్రీనివాసులునాయుడు పిలుపునిచ్చారు. విద్యార్థులను క్రీడల్లో తీర్చిదిద్దడానికి ఎస్‌జీఎఫ్ కృషి చేస్తున్నదన్నారు. క్రీడల్లో రాణించే విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్తు ఉంటుందన్నారు. డీఈవో మాట్లాడుతూ క్రీడలను ప్రభుత్వం ఎంతగానో ప్రోత్సహిస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ డీఈవో ఎం.అప్పారావు, ప్రభుత్వ పరీక్షల విభాగం సంచాలకులు శ్రీధర్ రెడ్డి, ఎస్‌జీఎఫ్ జిల్లా కార్యదర్శి కేఎం.నాయుడు, హెచ్‌ఎం రౌతు నాగేశ్వరరావు, ఎస్‌జీఎఫ్ మాజీ కార్యదర్శి ఎంవీ.నాగేశ్వరరావు, విద్యాకమిటీ చైర్మన్ గుర్రం అప్పలరాజు, పీడీలు అన్నాజీరావు, రాణి పాల్గొన్నారు.

కనకమ్మ సారె ఊరేగింపు

... 5వ పేజీ తరువాయి

తయారుచేసి అమ్మవారికి నివేదించి పూజలు చేశారు. వాగ్దేవి కళాశాల యాజమాన్యం శేషగిరి దంపతులు అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి సారె ఊరేగింపు కార్యక్రమాన్ని ప్రారంభించారు. అమ్మవారి ఆలయం నుంచి ఊరేగింపు ప్రారంభమై గాజువాక బైపాస్, ధర్మవరం, కాకానీ వీధి, సాలిపేట, ఎస్సీకాలనీ, మెయిన్‌రోడ్డు, హాస్పటల్ మీదుగా అమ్మవారి ఆలయానికి ఊరేగింపు చేరుకుంది. అనంతరం భక్తులకు అన్నసమారాధన నిర్వహించారు. కార్యక్రమంలో ఉత్సవ కమిటీ సభ్యులు కె.సాంబశివరావు, కోరారి నరేశ్, టి.నాని, ఏబీఎల్ రాజు, పి.రాము, టి.చిన్ని, కె.నాగు, కె.సూర్యప్రకాశ్, పి.నాని, కె.శ్యామ్‌కుమార్, ఎ.గోవింద్, ఉత్సవ కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

విద్యా సంస్థల బస్సుల తనిఖీలు

... 5వ పేజీ తరువాయి

చెందినబస్సులపై సమగ్ర తనిఖీలు చేపట్టామని జిల్లా రవాణాశాఖ అధికారి జి. మనోహర్ తెలిపారు. పాఠశాలల బస్సులు అనుసరించాల్సిన భద్రతా ప్రమాణాలు, ఎంవీ చట్టం, బస్సు బాడీకోడ్‌ల ప్రకారం పాటించబడుతున్నాయా అనే అంశాలను ఎంవీ ఇన్‌స్పెక్టర్ల ప్రత్యేక బృందాలు పరిశీలించినట్టు చెప్పారు. జిల్లాలో ఉన్న పాఠశాలల బస్సులన్నింటిని మూడు బృందాలు సూక్ష్మంగా పరిశీలించినట్టు ఆయన తెలిపారు. పరిశీలనలో ఫైర్ అలారం, డిటెక్షన్ సిస్టం, అత్యవసర ద్వారాలు, స్పీడ్ గవర్నర్లు, ఫైర్ పరికరాలు సక్రమంగా పనిచేస్తున్నాయా అనే అంశాలు ప్రధానంగా తనిఖీ చేశామన్నారు. మొత్తం 106 పాఠశాలల బస్సులను తనిఖీ చేయగా.. భద్రతాపరమైన లోపాలున్న 95 బస్సులకు నోటీసులు జారీ చేసి, పన్ను, ఫిట్‌నెస్ లోపాలున్న నాలుగు బస్సులను సీజ్ చేసినట్టు ఆయన తెలిపారు. అదేవిధంగా 24 పాఠశాలలను తనిఖీ బృందాలు ప్రత్యక్షంగా సందర్శించి సిబ్బందికి భద్రతా ప్రమాణాలపై అవగాహన కల్పించినట్టు చెప్పారు. బస్సుల భద్రతలో పాఠశాలల నిర్వాహకులు కూడా సమాన బాధ్యత వహించాల్సి ఉంటుందని ఆయన స్పష్టం చేశారు. యాజమాన్యాలు నిత్యం బస్సుల పరిస్థితులపై సమీక్షించాలని సూచించారు. అలాగే డ్రైవర్ల ఆరోగ్య పరిస్థితి సక్రమంగా ఉందో.. లేదో.. పర్యవేక్షించాల్సిన బాధ్యత కూడా పాఠశాలల నిర్వాహకులదేనన్నారు. విద్యార్థుల ప్రాణ భద్రతకు సంబంధించిన అంశాల్లో ఎటువంటి నిర్లక్ష్యం సహించమన్నారు. నిబంధనలు పాటించని వాహనాలపై కఠిన చర్యలు తీసుకుంటామని ఆర్‌టీవో మనోహర్ హెచ్చరించారు.

రెవెన్యూలో పైసావసూల్

... 5వ పేజీ తరువాయి

తక్కువ కాకుండా దండుకుంటున్నారు. అనకాపల్లి, సబ్బవరం, కశింకోట, ఎలమంచిలి, అచ్యుతాపురం, పరవాడ, రాంబిల్లి, ఎస్.రాయవరం, నక్కపల్లి, పాయకరావుపేట మండలాల పరిధిలో జాతీయ రహదారికి సమీపంలో ఉన్న భూముల విషయంలో లంచం మరికొంత ఎక్కువ చెల్లించుకుంటేనే పని అవుతుంది. ప్రజల అవసరాలకు అనుగుణంగా పనిని బట్టి రేటు నిర్ణయించి మరీ తహశీల్దారు కార్యాలయాల్లో సిబ్బంది దండుకుంటున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. జిల్లాలో కొందరు వీఆర్‌ఓలు, సర్వేయర్లు రికార్డులు తారుమారు చేయడంలో ఆరితేరిపోయారు. తహశీల్దార్ల డిజిటల్ కీలను తమ ఆధీనంలో ఉంచుకొని ఆన్‌లైన్‌లో మార్పులు, చేర్పులు చేసేస్తుంటారు. రికార్డుల తారుమారుకు భూ యజమానుల నుంచి భారీగా దండుకున్న మొత్తంలో అందరికీ సమానంగా వాటాలు పంచుతుంటారనే విమర్శలు వినిపిస్తున్నాయి. అయితే జిల్లాలో తహశీల్దారు కార్యాలయాలు, వీఆర్‌ఓలు, సర్వేయర్ల అవినీతి చిట్టా ఏసీబీ అధికారుల వద్ద ఉందనే భయంతో వణుకుతున్నారు.

ఏసీబీ దాడులు జరుగుతున్నా..

అవినీతి నిరోధక శాఖ దాడుల్లో పలువురు పట్టుబడుతున్నా, లంచాలకు అలవాటుపడిన ఉద్యోగులు మాత్రం తమ తీరు మార్చుకోవడం లేదు. 2024లో కశింకోట మండలం నర్సింగబిల్లి రెవెన్యూ జట్టపురెడ్డి తుని వీఆర్‌ఓ గన్నమరాజు శ్రీసూర్యకృష్ణ పృథ్వీ, ఓ రైతుకు వారసత్వంగా దఖలు పడిన భూమికి మ్యుటేషన్ చేసేందుకు రూ.20 వేలు లంచం తీసుకొంటూ ఏసీబీకి పట్టుబడ్డాడు. రోలుగుంట తహశీల్దారు కార్యాలయంలో 2023లో ఏసీబీ సోదాలు జరిగాయి. అప్పట్లో తహశీల్దారు, డిప్యూటీ తహశీల్దారు, వీఆర్‌ఓ అవినీతికి పాల్పడినట్టు నిర్ధారణ కావడంతో విచారణ జరగుతోంది. 2021 జూన్ నెలలో చీడికాడ వీఆర్‌ఓ రూ.20 వేలు లంచం తీసుకుంటూ ఏసీబీకి చిక్కాడు. ఇదే సంవత్సరంలో చోడవరంలో తహశీల్దారు, డిప్యూటీ తహశీల్దార్లు రూ.5 లక్షలు లంచం తీసుకొంటూ ఏసీబీకి చిక్కారు. 2022 సంవత్సరంలో దేవరాపల్లి మండలంలోని అలమండ వీఆర్‌ఓ ఒక రైతు నుంచి రూ.20 వేలు లంచం తీసుకుంటుండగా ఏసీబీ అధికారులకు రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుబడ్డాడు. 2021లో నాతవరం మండలం పీకే గూడెం వీఆర్‌ఓ సత్యనారాయణ రూ.2 వేలు లంచం తీసుకొని ఏసీబీకి పట్టుబడ్డాడు. ఇదే మండలంలో గుమ్మడిగండ వీఆర్‌ఓ సింహాచలం రూ.6 వేలు లంచం తీసుకుని, 2022లో ములగపూడి వీఆర్‌ఓ రూ.2 వేలు లంచం తీసుకొని పట్టుబడ్డారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు తహశీల్దారు కార్యాలయాల్లో అవినీతిపై నిఘా పెట్టాలని కోరుతున్నారు.

గంజాయి రవాణాపై నిఘా

చోడవరం, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): గంజాయి రవాణా నిరోధానికి పక్కా నిఘా ఏర్పాటు చేసినట్టు జిల్లా ఎస్పీ తుహిన్‌సిన్హా తెలిపారు. శుక్రవారం రాత్రి స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఆయన విలేకరులతో మాట్లాడుతూ, గంజాయి రవాణా జరగకుండా అన్ని ప్రాంతాల్లో చెక్‌పోస్టులు ఏర్పాటు చేసినప్పటికీ, ప్రత్యామ్నాయ రూట్లలో గంజాయిని స్మగ్లర్లు తరలిస్తున్నారని చెప్పారు. దీనిని దృష్టిలో ఉంచుకుని చెక్‌పోస్టులు లేని ప్రాంతాల్లో సైతం పోలీసు నిఘా ఉంచామని వివరించారు. గంజాయిపై అన్ని స్టేషన్ల సిబ్బందిని అప్రమత్తంగా ఉండాలని సూచించామన్నారు. గంజాయి, ఇతర మాదక ద్రవ్యాలను అరికట్టేందుకు వీలుగా జిల్లాలో ప్రత్యేకంగా ఎన్‌డీపీఎస్ సెల్ ఏర్పాటయిందని తెలిపారు. అలాగే గంజాయికి సంబంధించిన సమాచారం అందించే విషయంలో ప్రజలు కూడా సహకరించాలని విజ్ఞప్తి చేశారు. గంజాయి సమాచారం తెలిసిన వారు 112, లేదా 1972 నంబర్లకు సమాచారం అందించాలని సూచించారు. సమాచారం ఇచ్చిన వ్యక్తుల వివరాలను కూడా రహస్యంగా ఉంచుతామని తెలిపారు. ఇక జిల్లా పరిధిలో అన్ని పోలీస్ స్టేషన్ల పరిధిలో రౌడీ షీటర్ల కదలికపై నిఘా ఉంచామన్నారు. వారు ఎక్కడైనా అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే కఠినంగా వ్యవహరించాలని పోలీసులకు ఆదేశాలిచ్చినట్టు తెలిపారు. ఈ సమావేశంలో సీఐ అప్పలరాజు పాల్గొన్నారు.

బీఎన్ రోడ్డుకు మోక్షం

... 5వ పేజీ తరువాయి

స్థానిక బార్ అసోసియేషన్ న్యాయవాదులు కాంగ్రెస్‌గుల డేవిడ్, సీపీఐ, సీపీఎం. ఆమ్ ఆద్మీ పార్టీలు, ప్రజాసంఘాల నేతలు డీఎస్ ప్రసాద్ తదితరులు అనేక రోజులుగా న్యాయపోరాటం సాగిస్తున్న సంగతి తెలిసిందే. ఇక న్యాయవాదులు వేసిన కేసుపై జిల్లా కోర్టు జడ్జి ఏకంగా రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, ఆర్‌అండ్‌బీ ముఖ్య కార్యదర్శులను కోర్టు ఎదుట హాజరుకావాలంటూ నోటీసులు జారీ చేయడంతో రాష్ట్ర వ్యాప్తంగా బీఎన్ రోడ్డు ఓ సంచలనంగా మారింది. అధికార రాజకీయ వర్గాల్లో సైతం ఈ రోడ్డు చర్చనీయాంశంగా మారింది. ఈ రోడ్డు ఎప్పుడు పూర్తవుతుందా? తమ కష్టాలు ఎప్పటికి తీరతాయా అని మూడు జిల్లాల ప్రజలు ఎదురుచూస్తున్నారు. ఎట్టకేలకు బీఎన్ రోడ్డు పనులు ప్రారంభం కావడంతో స్థానికులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

క్రైం... crime news

దొంగతనం కేసులో ఇద్దరి అరెస్టు



నిందితులతో సీఐ స్వామినాయుడు, ఎస్ఐ

కశింకోట, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పలు గ్రామాల్లో మేకలు దొంగిలించిన కేసులో ఇద్దరిని అరెస్టు చేశామని సీఐ అల్లు స్వామినాయుడు శుక్రవారం తెలిపారు. అనకాపల్లి మండలం కొత్తూరు పంచాయతీ పరిధిలోని రామాపురంలో ఎన్టీఆర్‌నగర్‌కు చెందిన ఎలసూరి వంశీ, పాసిలి అరుణ్‌తేజదుర్గ నాయుడు అలియాస్ అరుణ్ తాళ్లపాలెం, జోగారావుపేట గ్రామాల్లో మేకలను దొంగిలించారన్నారు. ఈ కేసులో నిందితులను ఛేదించే క్రమంలో ఎలమంచిలి సంతలో మేకలు అమ్మడానికి వెళ్తున్న సమయంలో అదుపులోకి తీసుకున్నామని చెప్పారు. వీరిని విచారించగా రెండు గ్రామాల్లో మేకలు దొంగతనం చేశామని అంగీకరించినట్టు ఆయన తెలిపారు. ఈ మేరకు వారిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించామని చెప్పారు. ఈ కేసును వేగంగా ఛేదించిన ఎస్ఐలు లక్ష్మణరావు, మనోజ్‌కుమార్, సిబ్బందిని అభినందించారు.

గంజాయి కేసులో...



నిందితులతో సీఐ, ఎస్ఐ... పట్టుబడ్డ గంజాయి

పరవాడ, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): గంజాయిని ప్యాకెట్ల రూపంలో రవాణా చేస్తున్న ఇద్దరు వ్యక్తులను పరవాడ పోలీసులు శుక్రవారం అరెస్టు చేశారు. వారి నుంచి 88 ప్యాకెట్లలో 425 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. ఇందుకు సంబంధించి సీఐ ఆర్.మల్లికార్జునరావు, ఎస్ఐ భీమారావు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. ఒడిశా రాష్ట్రానికి చెందిన రస్మిరంజన్ బెహరా, అనకాపల్లి మండలం కొత్తూరుకు చెందిన బి.సత్యనారాయణ కలిసి గత కొంతకాలంగా తానాం, పరవాడ, తాడి, లంకెలపాలెం ప్రాంతాల్లో గంజాయిని చిన్న చిన్న ప్యాకెట్లుగా తయారుచేసి విక్రయాలు చేస్తున్నారు. స్థానికులు ఇచ్చిన సమాచారం మేరకు ఇద్దరిని శుక్రవారం మధ్యాహ్నం పరవాడ తహసీల్దార్ కార్యాలయం సమీపంలో దాడి చేసి, వారి వద్ద నుంచి ప్యాకెట్ల రూపంలో ఉన్న 425 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. ఇద్దరిపై కేసు నమోదు చేశారు. ఈ దాడిలో హెడ్ కానిస్టేబుల్ లోవరాజు, కానిస్టేబుల్ పోలురాజు, వీటీపీ బాబు పాల్గొన్నారు.

యువతి ఆత్మహత్యపై కేసు నమోదు

అనకాపల్లి టౌన్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని విజయరామరాజుపేటలో శుక్రవారం యువతి ఆత్మహత్య చేసుకున్న సంఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పట్టణ ఎస్ఐ కె.సంతోశ్‌కుమార్ తెలిపారు. విజయరామరాజుపేటలోని ఇంట్లో ఎవరూ లేని సమయంలో పి.సాయిదుర్గ (25) ఫ్యాన్‌కు చీరతో ఉరిపోసుకొని ఆత్మహత్య చేసుకుందన్నారు. పక్కింటి వారు చూసి మృతురాలి తల్లి సీతాలక్ష్మికి సమాచారం అందించారన్నారు. సాయిదుర్గ తల్లి సీతాలక్ష్మి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ తెలిపారు.

విలేకరిపై మహిళా వీఆర్వో పోలీసు ఫిర్యాదు

కోటవురట్ల, నవంబర్ 28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఓ పత్రికా విలేకరిపై మహిళా వీఆర్వో పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ సంఘటనకు సంబంధించి నక్కపల్లి సీఐ రామకృష్ణ, కోటవురట్ల ఎస్ఐ రమేశ్ అందజేసిన వివరాలిలా ఉన్నాయి. కోటవురట్ల మండలంలోని అన్నవరం వీఆర్వో జీఆర్.నూకరత్నంపై ఓ విలేకరి (ఆంధ్రజ్యోతి కాదు) తన వాట్సాప్ గ్రూపులో ఫొటోతో పాటు అసభ్య పదజాలంతో ఈ నెల 25న పోస్టు చేశారు. అలాగే గత నెల 10వ తేదీ నుంచి తహశీల్దార్ కార్యాలయానికి వచ్చి డబ్బులు ఇవ్వాలని, లేకుంటే సమస్యలను ఎదుర్కొంటావని వేధిస్తున్నాడు. ఈ విషయాన్ని సదరు వీఆర్వో తహశీల్దార్ దృష్టికి కూడా తీసుకువెళ్లారు. విలేకరి వాట్సాప్ పోస్టుతో తన ఆత్మాభిమానానికి భంగం కలిగించారని పోలీసు ఫిర్యాదులో వీఆర్వో పేర్కొన్నారు. అలాగే మహిళా వీఆర్వోకు రక్షణ కలిపించాలని, ఆమెను వేధిస్తున్న వ్యక్తిపై చర్యలు తీసుకోవాలని రాష్ట్ర వీఆర్వో అసోసియేషన్ అధ్యక్షుడు శ్రీనివాసరావు, ఉపాధ్యక్షుడు శంకర్, జిల్లా అధ్యక్షుడు రాజానాయుడు పోలీసులను కలిసి కోరారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు సీఐ, ఎస్ఐ తెలిపారు.

చురుగ్గా రైతుబజార్ పనులు

... 5వ పేజీ తరువాయి

అనకాపల్లిలో రైతు బజారు ఏర్పాటు చేయాలని ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ కృతనిశ్చయంతో ఉన్నారు. దీంట్లో భాగంగా జిల్లా కలెక్టర్ విజయకృష్ణన్, ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ ఇటీవల ఎన్టీఆర్ మార్కెట్‌యార్డును సందర్శించారు. యార్డులో ఖాళీగా, నిరుపయోగంగా ఉన్న బ్లాకులను పరిశీలించారు. కరోనా సమయంలో కూరగాయల వ్యాపారం ఎన్టీఆర్ మార్కెట్ యార్డులో జరిగింది. అప్పట్లోనే ప్రజలు మార్కెట్‌కు వచ్చి కూరగాయల కొనుగోలుకు అలవాటు పడ్డారు. కరోనా తరువాత యథావిధిగా గాంధీమార్కెట్‌లోనే వ్యాపారం సాగుతోంది. వీటి అన్నింటిని దృష్టిలో పెట్టుకొని ఇటు పార్కింగ్‌కు, వ్యాపారానికి అనువుగా ఉండే ఎన్టీఆర్ మార్కెట్ యార్డులో రైతు బజారు ఏర్పాటు చేస్తున్న విషయాన్ని ఇటీవల ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ ప్రకటించారు. మార్కెట్‌యార్డులో రైతు బజారు ఏర్పాటుకు ప్రభుత్వం కూడా రూ.14లక్షలు మంజూరు చేసింది. టెండర్ల ప్రక్రియ పూర్తయిన తరువాత మార్కెటింగ్ శాఖ ఏడీ అశోక్‌కుమార్ ఆధ్వర్యంలో రైతు బజారు ఏర్పాటు పనులు శరవేగంగా జరుగుతున్నాయి. ఇప్పటికే 17, 18 బ్లాకులతో పాటు గతంలో చేపల మార్కెట్ కోసం నిర్మించిన రెండు బ్లాకులను కూడా సిద్ధం చేస్తున్నారు. ఇప్పటికే చిన్న చిన్న బ్లాకులుగా ఏర్పాటు చేసి నంబర్లు కూడా వేశారు. డిసెంబరు నెలాఖరుకు రైతు బజారు ప్రజలకు అందుబాటులోకి వచ్చే అవకాశముంది. ఈ విషయమై మార్కెటింగ్ శాఖ ఏడీ అశోక్‌కుమార్ 'ఆంధ్రజ్యోతి' సంప్రదించగా.. పనులను వేగవంతం చేస్తున్నామన్నారు. ప్లాస్టింగ్‌లు పూర్తయ్యాయని, రంగులు వేసి విద్యుత్ సౌకర్యం కల్పించనున్నామన్నారు. ఈ బజారులో 150 మంది వర్తకులు, రైతులు తమ ఉత్పత్తులను విక్రయించేందుకు అవకాశం ఉందన్నారు. 20 రోజుల్లో నిర్మాణ పనులు పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు.

పంచాయతీల పునర్విభజన

... 5వ పేజీ తరువాయి

పరిపాలన యూనిట్లుగా గుర్తించి, పురపాలక సంఘాల తరహాలో ప్రతి గ్రామ పంచాయతీ పరిధిలో పారిశుధ్యం, తాగునీటి సరఫరా, గ్రామీణ అభివృద్ధి ప్రణాళిక, వీధి దీపాలు, ఇంజినీరింగ్, ఆదాయం, పన్నుల వసూళ్ల విభాగాలను ఏర్పాటు చేయనున్నారు. గ్రామ పంచాయతీలను స్పెషల్ రూరల్, అర్బన్ పంచాయతీలుగా విభజిస్తారు. పట్టణాలకు సమీపంలోని కనీసం 10 వేల జనాభాతో పాటు వార్షిక ఆదాయం రూ.కోటి ఉంటే ఇక ముందు రూర్బన్ పంచాయతీగా పరిగణించాలని నిర్ణయించారు. అంతేకాకుండా ప్రస్తుతం గ్రేడ్-1 పంచాయతీ కార్యదర్శుల పోస్టులను డిప్యూటీ ఎంపీడీఓ క్యాడర్‌లో చేర్చనున్నారు. మిగిలిన గ్రేడ్‌ల పంచాయతీల కార్యదర్శులను విభజించనున్నారు. పంచాయతీల ద్వారా మెరుగైన సేవలను అందించేందుకు జూనియర్ అసిస్టెంట్‌లు, బిల్లు కలెక్టర్లు, సీనియర్ అసిస్టెంట్‌లను నియమించాలని నిర్ణయించారు. జిల్లాలో ఇటువంటి పంచాయతీలు ఎన్ని ఉన్నాయనేది పంచాయతీ అధికారులు వివరాలు సేకరించే పనిలో ఉన్నారు. గ్రామాల అభివృద్ధికి పట్టుకొమ్మలైన గ్రామ పంచాయతీల పునర్విభజన, పునర్ వ్యవస్థీకరణ చేసి, పల్లెలను ప్రగతి పథంలో నడిపించేందుకు కూటమి ప్రభుత్వం చేస్తున్న కృషిని అన్ని వర్గాలు కొనియాడుతున్నాయి.

చికెన్ ధరలు

బ్యాగ్	రూ.లలో
రైతు ధర	100.00
లైవ్ ధర	120.00
విత్ స్కిన్	210.00
స్కిన్ లెస్	220.00

కోడి గుడ్లు (నెక్)

వంద గుడ్లు	రూ.లలో
విశాఖపట్నం	610
విజయనగరం	614
శ్రీకాకుళం	614